



స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

శ్రీగిరిపై వైభవంగా
లక్ష దీపోత్సవం

- పుష్కరిణికి దశవిధ హారతులు ఇచ్చిన అర్చకులు
- భక్తులతో కిటకిటలాడిన శ్రీశైల క్షేత్రం





క్యూలైన్‌లో భక్తులు

శివుడి ఆకారంలో దీపోత్సవం

దీపాలు వెలిగిస్తున్న భక్తురాలు

శ్రీశైలం, నవంబరు 18(ఆంధ్రజోతి): ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. కార్తీక మూడో సోమవారం పురస్కరించుకుని ఆలయ పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం, పుష్కరిణికి దశవిధ హారతులు కార్యక్రమాలను దేవస్థానం వైభవంగా నిర్వహించింది. కార్తీకమాసంలో సోమవారం రోజులలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలను పురస్కరించుకుని క్షేత్రానికి అశేష భక్తజనం తరలివచ్చారు. క్షేత్ర వీధులు భక్తుల రద్దీతో దర్శనమిచ్చాయి. భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా తరలి రావడంతో క్షేత్రం శివనామస్మరణతో మార్మోగింది. వేకువజాము నుంచే పాతాళగంగలో అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు, దీపారాధనలు చేశారు. స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులుతీరారు. కాగా ప్రధాన ఆలయం ఎదుట గల గంగాధర మంటపం వద్ద మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ధ్వజస్తంభానికి ఆకాశ దీపం కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ ఆకాశదీప ప్రజ్వలనకు ముందుగా అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని గణపతి పూజను నిర్వహించి, దీపప్రజ్వలన, దీపారాధనలు చేశారు. అలాగే కార్తీక మాసోత్సవాల సందర్భంగా దేవస్థానంలో అఖండ శివ భజనలు కొనసాగించారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు తాగునీరు, బిస్కెట్లు, అల్పాహారం ఏర్పాటు చేశారు. దర్శనానంతరం భక్తులకు అన్నదాన భవనంలో ఉదయం 10.30 గంటల నుంచి 3.30 గంటల వరకు భోజనం, సాయంత్రం 6.30 నుంచి అల్పాహారం అందజేశారు.

శ్రీశైలం మహాక్షేత్రంలో కార్తీకమాసం మూడో సోమవారం పురస్కరించుకొని లోక కల్యాణం కోసం పుష్కరిణి వద్ద దేవస్థానం లక్ష దీపోత్సవం క్రతువును శాస్త్రోక్తంగా చేపట్టారు. ముందుగా స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక అలంకరణ గావించి పుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆ తర్వాత పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ఇందులో భాగంగా వివిధ ఆకృతుల్లో రూపొందించిన దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. ఈ లక్ష దీపోత్సవంలో మహిళలు విశేష సంఖ్యలో పాల్గొని దీపారాధనలు చేశారు. ఈ సందర్భంగా అర్చకస్వాములు దీపోత్సవం ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు.

శ్రీశైల క్షేత్రంలో మూడో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని పుష్కరిణి వద్ద దశవిధ హారతుల కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. ప్రతిఏటా కార్తీక మాసంలో వచ్చేటువంటి సోమవారాలు, కార్తీక పౌర్ణమి రోజున పుష్కరిణికి దశవిధ హారతులను నివేదించడం సంప్రదాయంగా వస్తోంది. ఇందులో భాగంగా కార్తీక మాసంలో సోమవారాన్ని పురస్కరించుకుని పుష్కరిణికి వేద మంత్రోచ్చరణ నడుమ ఓంకార హారతి, నాగహారతి, త్రిశూల హారతి, నందిహారతి, సింహహారతి, సూర్యహారతి, చంద్రహారతి, కుంభ హారతి, నక్షత్ర హారతి, కర్పూర హారతులను పుష్కరిణికి వరుసగా సమర్పించారు. కాగా ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని పుష్కరిణిని విద్యుత్ దీపాలతో, పుష్పాలతో అలంకరించారు. దశవిధ హారతుల సమయంలో విద్యుద్దీపాలను నిలిపివేసి కేవలం లేజర్‌షోలతో, ఆధ్యాత్మికమైన శబ్దాల నడుమ హారతులను సమర్పించారు.

శ్రీశైలం ఈవోగా చంద్రశేఖర ఆజాద్ బాధ్యతలు



ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రశేఖర ఆజాద్

శ్రీశైలం, నవంబరు 18(ఆంధ్రజోతి): శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా ఎస్‌ఎస్ చంద్రశేఖర ఆజాద్ సోమవారం ఉదయం ఆలయ పరిపాలన భవనంలోని ఈవో చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రదాయాలను అనుసరించి ఆలయ అర్చకులు, వేదపండితులు ఈవోగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఎస్ చంద్రశేఖర ఆజాద్‌కు వేదాశీర్వాదం పలికారు. అనంతరం ఈవో దేవస్థానం అన్ని విభాగాల యూనిట్ అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి, స్థానిక శాసనసభ్యులు శ్రీశైల క్షేత్రాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో అభివృద్ధి చేయాలన్న ప్రగాఢ సంకల్పంతో ఉన్నారన్నారు. అదేవిధంగా భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం, శ్రీశైల క్షేత్ర సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ, గో సంరక్షణ, చెంచు గూడేలలో స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవాలు నిర్వహించడం, క్షేత్రంలో పచ్చదనాన్ని పెంచడం తదితర అంశాలపై ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

అర్జీలను గడువులోపు పరిష్కరించాలి: కలెక్టర్




ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను జాప్యం లేకుండా గడువు లోపు పరిష్కరించాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులను కలెక్టర్ స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారాలపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రీ ఓపెన్ కేసులు 25, సీఎం గ్రీవెన్స్‌కు సంబంధించి 16 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పీజీఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో ఇంకా 9 అర్జీలను అధికారులు చూడలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ నవ్య మాట్లాడుతూ జిల్లా లోని రీసర్వేకు సంబంధించి గ్రామసభలలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి పాల్గొన్నారు.

చట్టసభలో సిద్ధేశ్వరం

- శాసన మండలిలో గళమెత్తిన కర్నూలు, కడప ప్రజాప్రతినిధులు
- అలుగుపై పరిశీలన చేస్తాం
  - మంత్రి నిమ్మల రామానాయుడు
- అలుగు సాధ్యమేనని 2011లో ఐదుగురు నిపుణుల కమిటీ నివేదిక
- కరువుసీమ నీటి కష్టాలు తీర్చే ప్రతిపాదన
- సిద్ధేశ్వరం సీమ రైతుల సెంటిమెంట్



సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం ప్రదేశం

కర్నూలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సిద్ధేశ్వరం అలుగు.. రాయలసీమ వెలుగు అనే నినాదంతో ప్రజా ఉద్యమంగా మారిన నీటిపారుదల సమస్య మీద ఎట్టకేలకు విధాన సభలో సోమవారం వాడివేడి చర్చ జరిగింది. కడప జిల్లాకు చెందిన రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ సిద్ధేశ్వరంపై గళమెత్తారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం సీమ రైతుల సెంటిమెంట్.. అలుగు నిర్మాణంతో శ్రీశైలం జలాశయంలో చేరే పూడికకు అడ్డుకట్ట వేయవచ్చు.. తద్వారా ప్రాజెక్టు జీవిత కాలం పెంచడం ద్వారా తెలుగు రాష్ట్రాలకు సాగునీటి, తాగునీటి కష్టాలు తీర్చవచ్చని వీరు వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు ఫైలును చెత్తబుట్టలో పడేసింది. అప్పటి వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఐదేళ్లలో సిద్ధేశ్వరం అలుగు గురించి మాట్లాడిన పాపాన పోలేదని రైతులు అంటున్నారు. ఈ నేపథ్యంలో సిద్ధేశ్వరంపై చట్టసభలో చర్చ జరగడం ఆశావహ పరిణామం. దీంతో సీమ ప్రజల ఆకాంక్షగా, సెంటిమెంట్‌గా మారిన సిద్ధేశ్వరం అలుగు నిర్మాణానికి సానుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని భావించవచ్చు. ఈ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

శ్రీశైలం ప్రాజెక్టు సామర్థ్యం 311 టీఎంసీలు. పూడిక చేరడంతో 215 టీఎంసీలకు పడిపోయింది. తాజాగా అంచనా వేస్తే 180 టీఎంసీలకు చేరుతుందని రాయలసీమ సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు. ఏటా 2.5 టీఎంసీల పూడిక జలాశయంలో చేరుతుందని అంచనా. అదే క్రమంలో శ్రీశైలం ఎగువన 1985లో తెలుగుగంగ ప్రాజెక్టులో భాగంగా ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 21,500 క్యూసెక్కుల ప్రవాహంతో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నిర్మించారు. 2004లో అధికారం చేపట్టిన నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 44 వేల క్యూసెక్కులకు పెంచారు. రాయలసీమ జిల్లాలకు సాగు, తాగునీరు అందించే తెలుగుగంగ కాలువ, ఎస్‌ఆర్‌బీసీ, గాలేరు-నగరి సుజల స్రవంతి (జీఎన్‌ఎస్‌ఎస్) ప్రాజెక్టు, హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు (హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్)లు నిర్మించారు. కేసీ కాలువ కూడా సాగునీరు అందించేలా ముచ్చుమర్రి లిఫ్ట్ ఏర్పాటు చేశారు. ఆయా ప్రాజెక్టులకు శ్రీశైలం ఎగువ నుంచే కృష్ణా వరద జలాలు మళ్లించాల్సి ఉంది. ఏటేటా పూడిక చేరడం, 854 అడుగుల దిగువకు డ్యాం నీటి మట్టం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా కృష్ణా జలాలు సీమ రైతులకు అందని ద్రాక్షే అవుతున్నది.

మిగతా 6లో...

కర్నూలులో హాస్య బ్రహ్మా..!



బ్రహ్మానందంకు స్వాగతం పలుకుతున్న అభిమానులు 6

హైకోర్టు కోసం ఉద్యమిస్తాం

- కర్నూలు బార్ అసోసియేషన్ తీర్మానం
- నేటి నుంచి 23 వరకు కోర్టు విధుల బహిష్కరణ



సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు రవి గువేరా

కర్నూలు కల్చరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా టీడీపీ విడుదల చేసిన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని, ఇందుకోసం రాయలసీమ వ్యాప్తంగా తాము ఉద్యమాన్ని చేపడుతామని కర్నూలు బార్ అసోసియేషన్ తీర్మానించింది. ఈమేరకు సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో తీర్మానించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. క్రిష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పాలూరి రవిగువేరా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలు అయినా కూడా హైకోర్టు బెంచ్ విషయంలో ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నూలుకు ప్రభుత్వం చేస్తున్న అన్యాయానికి నిరసనగా మంగళవారం నుంచి 23 వరకు తాము కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కె. ఓంకార్, ఎం. సుబ్బయ్య, బి. చంద్రుడు, ఆర్. నరసింహులు, రంగ రవికుమార్ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి
ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు నవంబరు, (ఆంధ్రజ్యోతి): పోలీసులందరూ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. స్థానిక పోలీసు శిక్షణా కేంద్రంలో డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లాలో 150 మంది పోలీసులను డ్రోన్ ఆపరేటర్లుగా తీర్చిదిద్దేందుకు ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మొదటి విడతలో భాగంగా రెండు రోజుల పాటు 21 మంది పోలీసులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతలు కాపాడడంలో డ్రోన్ కెమెరాల వినియోగాన్ని కీలకం చేస్తామన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో నలుగురికి తక్కువ కాకుండా డ్రోన్ టెక్నాలజీపై అవగాహన పెంచేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐలు గౌతమి, వేణుగోపాల్, ప్రసాద్, అబ్దుల్ గౌస్ పాల్గొన్నారు.




డ్రోన్ వినియోగాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

ఏడు ఊర్ల గవి

● సహజసిద్ధమైన జలధార ● తరలివస్తున్న భక్తులు, ప్రకృతి ప్రేమికులు



గుహలోని విశాలమైన ప్రాంతం



గవిలోకి వెళ్తున్న మార్గం

గడివేముల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దివిటి దొంగల నుంచి ప్రాణాలు కాపాడిన ఆనాటి ఏడు ఊర్ల గవి నేడు ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతోంది. పచ్చని చెట్లు, ఎర్రమల సానువులలో ప్రకృతి ఒడిలో సహజసిద్ధంగా ఏర్పడిన ఏడు ఊర్ల గవి ఎన్నో విశేషాల నెలవు. నంద్యాల జిల్లా గడివేముల మండలంలోని పైబోగుల గ్రామ సమీపంలో ఉన్న ఈ గవిలో విశాలమైన గుహ, శివలింగం, నిత్యం శివుడిని అభిషేకిస్తున్న నీటి ధార.. ప్రజలను ఆకర్షిస్తూ ఆధ్యాత్మిక క్షేత్రంగా పరిఢవిల్లుతోంది. పూర్వం ఈ ప్రాంతంలో దివిటి దొంగల బెడద ఎక్కువగా ఉండేది. వారి నుంచి ప్రాణాలను కాపాడుకునేందుకు ఏడు ఊర్ల ప్రజలు ఈ గవిలో కొన్నేళ్ల పాటు తలదాచుకునేవారు. గుహ ముఖద్వారం చిన్నగా ఉన్నా లోనికి వెళ్లే కొద్ది విశాలంగా ఉంది.


● నిత్యం శివుడిని అభిషేకిస్తున్న నీటి ధార

ఏడు ఊర్ల గవి చుట్టు పక్కల ప్రాంతాల్లో ఎక్కడా నీటి నిల్వలు లేవు. ఈ గుహలోని శివలింగంపై మాత్రం నిత్యం నీటిధార పడుతూ భక్తులను ఆశ్చర్యచకితులను చేస్తోంది. గుహలో ఉన్న శివలింగానికి భక్తులు పూజలు చేస్తుంటారు. ముఖ్యంగా శివరాత్రి, కార్తీకమాస పర్వదినాల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తుంటారు. ప్రభుత్వం స్పందించి ఈ గవిని అభివృద్ధి చేస్తే పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి చెందుతుంది.

● ఏడు ఊర్ల గవికి ఎలా చేరుకోవాలంటే..

గడివేముల మండలం నుంచి 3 కి.మీ దూరంలో ఉన్న బొల్లవరం చేరుకొని అక్కడి నుంచి పైబోగులకు వెళ్లే మట్టిదారిలో 2.50 కి.మీ వెళ్తే ఈ గవిని చేరుకోవచ్చు.





గవిలో ఉన్న శివలింగం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న టీజీ వెంకటేశ్, బ్రహ్మానందం

కర్నూలులో హాస్య బ్రహ్మ..!

కర్నూలు కల్చరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సినీ హాస్య నటుడు బ్రహ్మానందం సోమవారం కర్నూలు నగరంలో సందడి చేశారు. ఆయనను చూసేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో బిర్లాగేటు సమీపంలోని స్కైలైన్ స్క్వేర్ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. 'జఫ్ఫా టీ ఫ్రాంచైజీని సినీ నటుడు బ్రహ్మానందం రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్‌తో కలిసి ప్రారంభించారు.



సినీ నటుడు బ్రహ్మానందంను చూడడానికి వచ్చిన జనం

పేదలకు గూడు కల్పించడంలో ప్రభుత్వం విఫలం

● ధనికులకు వత్తాసు.. పేదలకు అన్యాయం

● మహాధర్నాలో వక్తల ఆగ్రహం



ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు



ర్యాలీ చేస్తున్న కార్మికులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదలకు గూడు కల్పించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు పి. రామచంద్రయ్య ఆరోపించారు. సోమవారం సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో సీపీఐ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు వేలాదిమంది లబ్ధిదారులతో భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన మహాధర్నాకు నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. రామచంద్రయ్య మాట్లాడుతూ నగరంలో పేదలు నివాసం ఉండేందుకు 3 సెంట్ల స్థలాన్ని కేటాయించాలన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు. పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే ఒక్క సెంటు స్థలం సరిపోదని సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘాలు ఆనాడే వైసీపీ ప్రభుత్వానికి చెప్పినప్పటికీ ఖాతరు చేయకుండా ముందుకు వెళ్లిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వమైనా పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తక్షణమే ఇచ్చిన హామీలను అమలు చేసి రోడ్లు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక సౌకర్యాలను కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు, సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర సహాయ కార్యదర్శులు జి.చంద్రశేఖర్, మహేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

సమానత్వాన్ని బోధించిన భక్త కనకదాసు

కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తన కీర్తనల ద్వారా భక్తి తత్వాన్ని, సామాజిక సమానత్వాన్ని బోధించిన గొప్ప తత్వవేత్త భక్తకనకదాసు అని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అన్నారు. సోమవారం భక్త కనకదాసు జయంత్యుత్సవాన్ని పురస్కరించుకని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, జల్లా వెనుకబడిన తరగతుల సహకార సంఘం లిమిటెడ్ అధ్వర్యంలో బీసీ సంక్షేమ భవన్‌లో శ్రీ భక్త కనకదాసు విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా పరిషత్ సమావేశభవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ భకత్త కనకదాసు 1509 సంవత్సరంలో జన్మించి 1609 సంవత్సరం దాకా జీవించారన్నారు. సైన్యంలో కూడ పని చేసి యుద్ధంతో గాయపడి, తదుపరి భక్తి మార్గంలోకి వెళ్లి ఎన్నో కీర్తనలను, రచనలను సమాజానికి అందించారని కొనియాడారు. 417 ఏళ్ల తరువాత కూడ భక్తకనకదాసు జయంతిని ఇప్పటికి నిర్వహించుకుంటున్నామంటే వారి నుంచి చాలా నేర్చుకోవాల్సి ఉందని అన్నారు.



భక్త కనకదాసుకు పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్, తదితరులు

పాసు పుస్తకాలు మార్చేసుకున్నారు

● ఫేక్ ట్రేడింగ్‌తో మోసం

● పోలీసు స్పందనకు 90 ఫిర్యాదులు

కర్నూలు క్రైం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట సమీపంలో ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ బిందుమాధవ్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 90 ఫిర్యాదులు అందాయి.

● ముంబాయికి వలస వెళితే తన పేరుమీద ఉన్న 17 ఎకరాల 80 సెంట్ల పొలాన్ని వేరే వ్యక్తులు తమ పేరుపై పాసుపుస్తకాలు చేయించుకున్నారని, ఆర్ఐ, వీఆర్‌వోలతోపాటు ఆ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోసిగి మండలం, కందుకూరి గ్రామానికి చెందిన ఈరన్న అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.

● తాను ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ చేస్తుంటానని, ఇటీవల సీఐఎస్‌వీ అనే ట్రేడింగ్ యాప్ నుంచి పెట్టుబడి పెట్టాలని లింకు రావడంతో ఆ లింకు క్లిక్ చేసి తన బ్యాంకు అకౌంట్ నుంచి రూ.4.80 లక్షలు పెట్టుబడిగా పెట్టానని, విత్‌డ్రా చేసుకుంటే తిరిగి రావడం లేదని, తనకు న్యాయం చేయాలని కర్నూలు సంతోష్‌నగర్‌కు చెందిన చాంద్‌బాషా ఫిర్యాదు చేశారు.

● వెంకాయపల్లె ఎల్లమ్మ గుడి ఎదురుగా ఉన్న ఒక ప్రైవేటు వెంచర్‌లో సత్యబాబు అనే వ్యక్తి రూ.24 లక్షలు తీసుకొని ఇల్లు ఇవ్వడం లేదని, డబ్బులు కూడా వాపస్ చేయడం లేదని కర్నూలుకు చెందిన లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశారు.

● కర్నూలు పాతబస్టాండులో లక్ష్మీ జువెలర్స్‌కు చెందిన నాయుడు అనే వ్యక్తి బంగారం ఇస్తానని డబ్బులు తీసుకొని పరారయ్యాడని, తనకు న్యాయం చేయాలని వజనకుమారి అనే మహిళ ఫిర్యాదు చేసింది.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

నారా రోహిత్‌కు మల్లెల రాజశేఖర్ పరామర్శ

ఓర్వకల్లు నవంబరు, 18 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కన్ను మూసిన చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, సీఎం చంద్రబాబు నాయుడు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు కుమారుడు నారా రోహిత్ టీటీడీ పాలకమండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ పరామర్శించారు. సోమవారం నారావారి పల్లె గ్రామానికి వెళ్లిన మల్లెల రాజశేఖర్ నారా రోహిత్‌ను ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. మృతి చెందిన నారా రామూర్తి నాయుడు ఎమ్మెల్యేగా చంద్రగిరి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. అలాగే సీఎం చంద్రబాబును కూడా కలిశారు. ఈయన వెంట అనంతపురం జిల్లా సింగనమల ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు ఉన్నారు.



నారా రోహిత్‌ను పరామర్శిస్తున్న టీటీడీ పాలకమండలిసభ్యుడు మల్లెల రాజశేఖర్

మహిళపై వైసీపీ వర్గీయుల దాడి

స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధిత మహిళ



గాయపడ్డ ఆదిలక్ష్మి

పత్తికొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థలం వివాదంలో ఓ మహిళపై వైసీపీ వర్గీయులు దాడి చేసి గాయపరచిన సంఘటన సోమవారం పత్తికొండ మండలం దూదేకొండ గ్రామంలో చోటుచేసుకొంది. బాధితురాలు ఆదిలక్ష్మి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దూదేకొండ గ్రామానికి చెందిన ఆదిలక్ష్మికి గ్రామకంఠం స్థలంలో గత ముప్పై ఏళ్ల క్రితం ప్రభుత్వ అధికారులు ఇంటి స్థలం కేటాయించారు. హౌసింగ్ కింద పక్కా ఇళ్లు మంజూరు కావడంతో ఇళ్లు నిర్మించుకుంది. అయితే అమె తన ఇంటి ముందు ఉన్న స్థలాన్ని కొనుగోలు చేసి తన పేరున పట్టా పొందింది. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామానికి చెందిన వైసీపీ వర్గీయులైన రామాంజినేయులు (అప్పటి వలంటీర్) లతో పాటు పెద్దయ్య మరికొందరు కలసి ఆదిలక్ష్మి ఇంటి ముందు భాగాన షెడ్డు (రేకుల బంకు) వేశారు. దారికి అడ్డుగా తన ఇంటి ముందు తన స్థలంలోనే షెడ్డు ఎలా వేస్తారని నిలదీసింది. షెడ్డు నిర్మాణం పనులను చేపడుతుండగా అడ్డుకోబోయిన తనను కట్టెలతో కొట్టి తీవ్రంగా గాయపరిచారని బాధిత మహిళ విలేకర్ల ఎదుట వాపోయింది. గత వైసీపీ ప్రభుత్వంలో దొంగ పట్టాలు సృష్టించుకొని, తన స్థలాన్ని దౌర్జన్యంగా స్వాధీనం చేసుకొని, తనను, కుటుంబ సభ్యులను చంపుతామని బెదిరిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటనపై సీఐ జయన్నను వివరణ కోరగా బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

హిందూ సంప్రదాయాలను కాపాడుకోవాలి

- హిందూ ధర్మపరిరక్షణ కర్త మనోహర్‌దాస్ గురూజీ

పగిడ్యాల, నవంబరు 18,(ఆంధ్రజ్యోతి) : భారతదేశంలో హిందూ మత సంప్రదాయలను పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని తిరుపతి హిందూ ధర్మపరిరక్షణ కర్త రాథ మనోహర్‌దాస్ గురుజీ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పగిడ్యాల గ్రామంలోని ఉమమహేశ్వర దేవాలయం వద్ద కార్తీక వనభోజన మహోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హిందూ ధర్మ పరిరక్షణ కర్త రాథమనోహర్ దాస్ గురుజీ, బైలూరుయోగీష్ ప్రభు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర మహిళామోర్చా నాయకురాలు గీతారాణి తదితరులు హాజరయ్యారు.



ప్రసంగిస్తున్న మనోహర్‌దాస్‌గురుజీ

చట్టసభలో సిద్ధేశ్వరం

(5వ పేజీ తరువాయి)

ఈ సమస్యకు ఏకైక పరిష్కారం సంగమేశ్వరం చెంతన రెండు కొండల మధ్యలో 'సిద్ధేశ్వరం అలుగు' నిర్మాణమేనని ఏనాడో సాగునీటి నిపుణులు తేల్చారు. ఈ అలుగు సాధన కోసం రాయలసీమ సాగునీటి సాధన సమితి సహా వివిధ రాయలసీమ సంస్థలు పోరాటం చేస్తున్నాయి. 2016 మే 31న వేలాది మంది రైతులు సిద్దేశ్వరం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆనాడు టీడీపీ అధికారంలో ఉంటే.. వైసీపీ ప్రతిపక్షంలో ఉంది. రాజకీయ లబ్ధి కోసం వైసీపీ నాయకులు రైతుల ఉద్యమానికి మద్దతుగా నిలిచారు. అధికారం చేపట్టాక ఐదేళ్ల సిద్ధేశ్వరం అలుగు ఊసే ఎత్తలేదు. తాజాగా టీడీపీ కూటమి అధికారంలో ఉన్నప్పటికీ .. ఆ పార్టీ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మండలిలో సిద్ధేశ్వరం గళం వినిపించారు.

● 2011లోనే నిపుణుల కమిటీ ఆమోదం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం సాధ్యాసాధ్యాలపై అధ్యయనం కోసం 2011 మార్చి 11న అప్పటి ఇంజనీర్-ఇన్-చీఫ్ (ఏడబ్ల్యూ) ఎంకే రెహమన్ చైర్మన్/కన్వీనర్‌గా ఐదుగురు ఇంజనీరింగ్ నిపుణులతో కమిటీ వేశారు. ఈ కమిటీలో మీడియం ఇరిగేషన్ ఈఎన్‌సీ పీఎస్ఆర్ సుబ్రమణ్యం, ఇరిగేషన్ ఈఎన్‌సీ సి. మురళీధర్, డబ్ల్యూటీపీ డైరెక్టర్ ఎం. సాంబమూర్తి, కర్నూలు జిల్లా ప్రాజెక్ట్ సీఈ కె. జలంధర్ సభ్యులుగా ఉన్నారు. అధ్యయనం తరువాత ఈ కమిటీ 2011 ఆగస్టు 19న ఆ కమిటీ సమావేశమై కీలక అంశాలపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. శ్రీశైలం ఎగువన కృష్ణా నదిపై రాయలసీమ కరువు పీడిత జిల్లాలకు సాగు, తాగునీరు అందించే 8 ప్రాజెక్టులు ఉన్నాయి. శ్రీశైలం నుంచి విద్యుత్ ఉత్పత్తి పేరిట నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. డ్యాం నీటి మట్టం 854 అడుగులకు తగ్గిపోతే సీమ ప్రాజెక్టులకు నీటిని విడుదల చేయలేని పరిస్థితి ఉంది. అదే జరిగితే కరువుసీమ జిల్లాలకు తాగు, సాగునీరు అందడం కష్టం అవుతున్నది. దీంతో రాయలసీమ కరువు ప్రాంతంలో తాగు, సాగు నీటి అవసరాలు తీర్చాలంటే సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం అవసరం ఉందని నిపుణుల కమిటీ నిగ్గుతేల్చింది. నాటి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. అదే క్రమంలో 854 అడుగుల నీటి మట్టంలో అలుగు నిర్మిస్తే.. శ్రీశైలంలో ఏటా చేరే 2.5 టీఎంసీ పూడికను సంగమేశ్వరం వెనుకాలే ఆపేసి డ్యాం జీవితకాలం పెంచవచ్చు.. అధిక వరదలు వస్తే పోతిరెడ్డిపాడు నుంచి వరదను మళ్లించి డ్యాంకు రక్షణ కల్పించవచ్చని సీమ సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు. రాష్ట్ర విభజన తరువాత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం, వైసీపీ ప్రభుత్వాలు రెండూ పట్టించుకోలేదు. దీంతో అప్పట్లో ఆ రెండు ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో ఈ విడత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలో విధాన సభ వేదికగా సిద్ధేశ్వరం ఆ పార్టీ ఎమ్మెల్సీలే చర్చనీయాంశం చేయడం స్వాగతించాల్సిన పరిణామం.



● సిద్దేశ్వరంపై గళమెత్తిన ప్రజాప్రతినిధులు

రాయలసీమ సెంటిమెంట్‌గా మారిన సిద్ధేశ్వరం అలుగు నిర్మించాల్సిందే అని కడప జిల్లాకు చెందిన రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గళమెత్తారు. ఈ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలు, ఆంధ్రప్రదేశ్ మొత్తానికి ఏ విధరంగా ప్రయోజనమో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అంకెలతో సహా వివరించారు. అలుగుపై ప్రజల్లో ఆకాంక్ష బలంగా ఉంది.. రైతుల ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నారు.. ప్రభుత్వం తప్పక చేపట్టాలని మంత్రి ఫరూక్ మండలిలో వాయిస్ వినిపించారు.

● పరిశీలిస్తాం

ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, మంత్రి ఫరూక్ అడిగిన ప్రశ్నలకు మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానం ఇస్తూ సిద్దేశ్వరం అలుగు నిర్మాణం వల్ల అదనపు నీటి సామర్థ్యం ఉంటే తప్పకుండా పరిశీలించి చేపడుతామని వివరించారు. 2013 జూన్ 26న అప్పటి ప్రభుత్వం 2120 మెమో ఇచ్చింది. శ్రీశైలం ఫోర్‌షోర్ ఏరియాలో మరో డ్యాం నిర్మాణం వల్ల అదనంగా నీటి నిల్వ ఉండదని, ఆ ప్రాజెక్టు అవసరం లేదని తేల్చిచెప్పారు. 2016-17లో మళ్లీ సిద్ధేశ్వరం ప్రతిపాదన వచ్చింది. అంతర్ రాష్ట్ర సమస్య ఉందని, దీని వల్ల ప్రయోజనం లేదని 2018 సెప్టెంబరు 12న అనాటి ఈఎన్‌సీ కూడా లేఖ ఇచ్చారని ఆయన అన్నారు. రాయలసీమ ప్రాంతానికి నీటి ఇచ్చే విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగానే హంద్రీనీవాకు రూ.2,500 కోట్లు కేటాయించి విస్తరణ చేపట్టబోతున్నామని తెలిపారు. సిద్ధేశ్వరంపై కూడా అధ్యయనం చేసి అదనపు నీటి నిల్వకు అవకాశం ఉంటే .. రాయలసీమ రైతులకు ఉపయోగకరంగా ఉందంటే తప్పక చేపడుతామని మంత్రి అన్నారు.

● మంత్రి నిమ్మల డొంకుతిరుగుడు సమాధానం

సిద్ధేశ్వరంపై మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానం డొంకతిరుగుడుగా ఉంది. 2011లోనే ఐదుగురు నిపుణుల కమిటీ సిద్ధేశ్వరం నిర్మాణం అవసరం ఉందని నివేదిక ఇచ్చింది. ఏటా 2.50 టీఎంసీలు పూడిక శ్రీశైలంలో చేరుతున్నది. ఇప్పటికే 311 టీఎంసీలు నుంచి 215 టీఎంసీలకు తగ్గింది. తాజాగా అంచనా వేస్తే 180 టీఎంసీలు కూడా ఉండదు. అంటే దాదాపు 100 టీఎంసీలు సామర్థ్యం కోల్పోయాం. సిద్ధేశ్వరం అలుగు ద్వారా పూడికకు కట్టడి చేసి శ్రీశైలం డ్యాం జీవితకాలం పెంచవచ్చు. అదనపు సామర్థ్యం ఉండదని ప్రతిపాదన తుంగలో కలిపే ప్రయత్నం చేయకూడదు.

- బొజ్జా దశరథరామిరెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు

నారసింహా.. నమో నమః

స్వామి, అమ్మవార్లకు నవకలశ తిరుమంజనం



ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్య క్షేత్రం అహోబిలం లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో కార్తీకమాస పూజలు విశేషంగా నిర్వహిస్తున్నారు. కార్తీక వనభోజన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వాహకులు సోమవారం వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవీ సమేత ప్రహ్లాదవరద స్వామి ఉత్సవమూర్తులకు లక్ష్మీవనంలోని ఉసిరి చెట్టు కింద పూజలు నిర్వహించారు. టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాత్కాలిక పదోన్నతి కల్పించాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో పని చేస్తున్న వార్డు అమ్యూనిటీస్‌కు రోస్టర్ ప్రకారం మున్సిపల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఎంఏఈఈ), మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్‌గా రోస్టర్ పద్ధతిలో తాత్కాలికంగా పదోన్నతులు కల్పించాలని అనంతపురం పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్.రామ్మోహన్‌రెడ్డి కమిషనర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు-7, ఆదోని-4, ఎమ్మిగనూరు-1, గూడూరు-2, నంద్యాల-2, ఆత్మకూరు-2, ఆళ్లగడ్డ-2, నందికొట్కూరు-1, డోన్-2 ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఇంజనీర్ ఇన్ చీఫ్ ఇప్పటికే వార్డు అమ్యూనిటీస్‌కు తాత్కాలికంగా పదోన్నతులు కల్పించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. సీనియారిటీ ప్రకారమే వార్డు అమ్యూనిటీస్‌కు ఎంఏఈఈ/ఎంఏఈలు పదోన్నతులు కల్పించాలని తెలిపారు. అమ్యూనిటీస్ వివరాలను ఇంజనీర్ ఇన్ చీఫ్‌నకు పంపించాలని చెప్పారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకందుకూరు గ్రామానికి చెందిన ఓబయ్య(48) సోమవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఆళ్లగడ్డ రూరల్ ఎస్‌ఐ హరి ప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఓబయ్య గ్రామ పరిసరాల్లో మేకల కోసం ఆకులు కోస్తుండగా కొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతో ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. చికిత్స నిమిత్తం బాధితుడిని కుటుంబ సభ్యు లు ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా ఓబయ్య అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారన్నారు. మృతుడి భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ హరి ప్రసాద్ తెలిపారు.

నిప్పుల వాగులో బాలిక గల్లంతు

వెలుగోడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు మండలంలోని అయ్యవారిపల్లి వద్ద నిప్పులవాగులో ఓ బాలిక గల్లంతైంది. మహానంది మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన హరినాథ్‌బాబు తమ కుటుంబ సభ్యులతో కలిసి నోముల పండుగ కోసం తన అత్తగా రింటికి వచ్చారు. అయ్యవారిపల్లిలో హరినాథ్‌బాబు కూతుళ్లు భవ్యశ్రీ, బానేశ్వర్‌లను తీసుకొని మామ రామచంద్రుడు నిప్పులవాగుకు స్నానం చేసేందుకు తీసుకెళ్లారు. నదిలో స్నానం చేస్తుండగా భవ్యశ్రీ, బానేశ్వరులు నీటి ఉధృతికి కొట్టుకుపోయారు. రామచంద్రుడు బానేశ్వర్‌ను కాపాడగా పదేళ్ల చిన్నారి భవ్యశ్రీ కొట్టుకుపోయింది గాలించినన ఆచూకీ లభించలేదు దీంతో కుటుంబ సభ్యులు వెలుగోడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాతగారి ఇంటికి పండుగ కోసం వచ్చి చిన్నారి నీటి ఉధృతిలో కొట్టుకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీయ్యారు.

యువకుడి హత్య

కర్నూలు క్రైం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోగల సంకల్‌బాగ్ కేశవరెడ్డి స్కూల్ సమీపంలో కృపానందం అలియాస్ ఆనంద్ (25) అనే యువకుడు హత్యకు గురయ్యాడు. స్థానిక ధర్మపేటకు చెందిన కృపానందం గౌండా పని చేస్తుంటాడు. సోమవారం మధ్యాహ్నం తర్వాత రోజా వీధికి చెందిన మరో యువకుడు షేక్ అజీజ్‌తో కలిసి బైటికి వెళ్లి కల్లు తాగారు. ఆ తర్వాత కేశవరెడ్డి స్కూల్ పక్కనే ఉన్న పాడుబడిన నిర్మాణంలో ఉన్న భవనంలోకి వెళ్లి ఇద్దరూ కలిసి ముక్కలాట ఆడారు. ఈ ఆటలో ఇరువురి మధ్య ఘర్షణ జరిగినట్లు తెలుస్తోంది. క్షణికావేశానికి గురైన షేక్ అజీజ్ పక్కనే ఉన్న రాయి తీసుకొని కృపానందం తలపై కొట్టాడు. దీంతో కృపానందం అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఆ తర్వాత షేక్ అజీజ్ పరారయ్యాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి హత్య జరిగిన తీరును పరిశీలించారు. కృపానందం తల్లి ఏసమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజారావు తెలిపారు.

ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలి

ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సిబ్బందిని ఆదేశించారు. సోమవారం నంద్యాల జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఏఎస్పీ ఎన్. యుగంధర్‌బాబుతో కలిసి పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యా దులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరిస్తామ న్నారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంటుందన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన వ్యక్తులు తమకు జరిగిన అన్యాయాలను ఎస్పీకి వినతి రూపంలో విన్నవించుకున్నారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

కారు, రెండు ద్విచక్ర వాహనాలు సీజ్

కోసిగి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కోసిగిలో 45 బాక్సుల భారీగా కర్ణాటక మద్యంతో పాటు ఒక కారు, రెండు ద్విచక్రవాహనాలు సీజ్ చేసి 5మందిపై కేసు నమోదు చేసినట్లు కోసిగి సీఐ మంజునాథ, ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. సోమవారం కోసిగి పోలీస్ స్టేషన్‌లో సీఐ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వాహనాల తనిఖీల్లో భాగంగా కోసిగి మండల పరిధిలోని పల్లెపాడు సీఎస్‌ఐ చర్చి దగ్గర కర్ణాటకకు చెందిన కారులో 21 బాక్సుల అక్రమ కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామానికి చెందిన ఈడిగ రామును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కర్ణాటకకు చెందిన మరొకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. అలాగే కందకూరు గ్రామంలోని క్రాస్ రోడ్డులో కడదొడ్డి గ్రామానికి చెందిన అంజనేయులు, రామాంజి రెండు మోటారు సైకిళ్లపై 24 అక్రమ కర్ణాటక మద్యం తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు తెలిపారు. రెండు కేసుల్లో కలిపి 45 బాక్సుల కర్ణాటక మద్యంతో పాటు ఒక కారు, రెండు బైకులను సీజ్ చేసినట్లు తెలిపారు. ఏఎస్‌ఐలు తిరుపాల్ నాయక్, నాగరాజు సిబ్బంది శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, షేక్షావలి ఉన్నారు.



పట్టుబడిన కర్ణాటక మద్యం, కారు, బైక్‌లు, నిందితులను చూపుతున్న పోలీసులు

నీటి సంఘాల ఎన్నికలు వాయిదా!

- అక్టోబరు 21న కలెక్టరు నోటిఫికేషన్ జారీ
- ఓటర్ల జాబితాను విడుదల చేయని రెవెన్యూ అధికారులు
- 23న జరగాల్సిన ఎన్నికలు వాయిదా పడినట్లే..
- అసెంబ్లీ సమావేశాలు తరువాత మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం



కర్నూలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొమ్మిదేళ్ల తరువాత సాగునీటి సంఘాల ఎన్నికలకు టీడీపీ కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అక్టోబరు 21న జిల్లా కలెక్టరు నోటిఫికేషన్ జారీ చేశారు. షెడ్యూలు ప్రకారం 23న ఎన్నికలు జరగాల్సి ఉంది. గ్రామాల్లో రాజకీయ సందడి మొదలైంది. పదవులపై ఆసక్తి ఉన్న నాయకులు రైతులను కలసి మద్దతు కూడగడుతున్నారు. మరో పక్క అధికార యంత్రాంగం ఎన్నికల సిబ్బంది నియామకం.. ఓటర్ల జాబితా తయారీలో నిమగ్నం అయ్యారు. అయితే 13న ఓటర్ల జాబితా ప్రకటించకపోడం వల్లే ఎన్నికలు వాయిదా పడినట్లు తెలుస్తున్నది. ఈ నెల 22 వరకు అసెంబ్లీ సమావేశాలు ఉన్నాయి. నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు లేకుండా ఎన్నికలు జరిగితే రాజకీయంగా నష్టపోయే అవకాశం ఉండడంతో ప్రభుత్వం వాయిదా వేసిందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అసెంబ్లీ సమావేశాలు తరువాత మళ్లీ నోటిఫికేషన్ జారీ చేయవచ్చని అధికారులు అంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 285 సంఘాలకు ఎన్నికలు జరాగాల్సి ఉంది.

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కేసీ కెనాల్, కేసీ కెనాల్, తుంగభద్ర దిగువ కాలువ, రాంపురం చానెల్, గాజులదిన్నె ప్రాజెక్టు, తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీ, హంద్రీనీవా ప్రాజెక్టు, హెచ్చెల్సీ ఆలూరు బ్రాంచి కెనాల్, చిన్ననీటి పారుదల శాఖ పరిధిలో కర్నూలు జిల్లాలో 310, నంద్యాల జిల్లాలో 320 చెరువులు ఉన్నాయి. వీటితో వంద ఎకరాలు పైబడిన చెరువులు 145 వరకు ఉన్నాయని ఇంజనీర్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మేజర్ ప్రాజెక్టుల పరిధిలో 212 సాగునీటి సంఘాలు, మీడియం ప్రాజెక్టు పరిధిలో 26 సాగునీటి సంఘాలు, మైనర్ ఇరిగేషన్ (చిన్ననీటి పారుదల) పరిధిలో 146 సాగునీటి సంఘాలు ఉన్నాయి. సాగునీటి ఎన్నికలు తరువాత కేసీ కెనాల్, ఎల్లెల్సీ, తెలుగుగంగ, ఎస్సార్బీసీ కాలువ పరిధిలో డిస్ట్రిబ్యూటర్ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకుంటారు. రాష్ట్ర విభజన తర్వాత 2015-16లో ఆనాటి టీడీపీ ప్రభుత్వం సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. 2019 మేలో కొలువుదీరిన వైసీపీ ప్రభుత్వంలో వీటి ఎన్నికలు నిర్వహించలేదు. వైసీపీ నాయకులు, సానుభూతి పరులకే నామినేటెడ్ పదవులు పంపకాలు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాల్లో రైతులను అందులో భాగస్వామ్యం చేయాలని, కాలువలు, డిస్ట్రిబ్యూటరీలను ఆధునికీకరించాలనే సంకల్పంతో ఎన్నికల నిర్వహణకు శ్రీకారం చుట్టింది.

● మూడు దశల్లో ఎన్నికలు:

● భారీ (మేజర్), మధ్యతరహా (మీడియం) ప్రాజెక్టుల పరిధిలో ఒక్కో సాగునీటి సంఘం పరిధిలో 100-120 మంది రైతులు, మైనర్ ఇరిగేషన్ (ఎంఐ) పరిధిలోని నీటి సంఘాల్లో దాదాపు 30-50 మంది రైతులు సభ్యులుగా ఉంటారని అధికారులు తెలిపారు. ఒక్కో సంఘంలో ఆరుగురు ప్రాదేశిక నియోజకవర్గం(టీసీ) సభ్యులు ఉంటారు.

● **తొలి దశ:** సాగునీటి సంఘాలు (డబ్ల్యూయూఏ) పరిధిలో రెవిన్యూ గుర్తించిన ఓటు హక్కు కలిగిన రైతులు ఆరుగురు టీసీ సభ్యులను ఎన్నుకుంటారు. ఈ ప్రక్రియ ఈ నెల 23న జరగాల్సి ఉండింది. టీసీ సభ్యుల్లో ఇద్దరిని అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నుకుంటారు.

● **రెండవ దశ:** డిస్ట్రిబ్యూటరీల పరిధిలో ఉండే సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు సమావేశమై డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు.

● **మూడవ దశ:** ఉమ్మడి జిల్లాలో కేసీ కెనాల్, ఎల్లెల్సీ, ఎస్సార్బీస్, తెలుగుగంగ ప్రాజెక్టులు కమిటీలు ఉన్నాయి. డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు సమావేశమై ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లను ఎన్నుకుంటారు. సాగునీటి వ్యవస్థలో డిస్ట్రిబ్యూటరీలు, ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష పదవులకు మంచి ప్రాధాన్యత ఉంటుంది.

● కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, ప్రాజెక్టుల పరిధిలో జరిగే మరమ్మతులు, ఆధునికీకరణ పనులు ఈ కమిటీ పర్యవేక్షణలోనే జరుగుతాయి. సాగునీటి పంపిణీలో ముఖ్యమైన బాధ్యత వీరికే ఉంటుంది..

● అటు అధికారులు.. ఇటు రాజకీయ నాయకులు:

సాగునీటి సంఘాలు టీసీ సభ్యుల ఎన్నిక మొదలు ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు పూర్తి చేసే వరకు 40 రోజులు పడుతుంది. అక్టోబరు 9న రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలుపగా.. 21న కలెక్టరు పి. రంజిత్‌బాషా ఎన్నికల నిర్వహణకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. సాగునీటి సంఘాల వారిగా డీఈఈ, ఏఈఈ స్థాయి ఇంజనీర్లను ప్రత్యేక అధికారులను నియమించారు. వీరి పర్యవేక్షణలోనే ఎన్నికలు నిర్వహించాలి. రెండు జిల్లాల్లో ఇంజనీరింగ్ అధికారులు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత జరుగుతున్న తొలి ఎన్నికలు ఇవి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు నీటి సంఘాల ఎన్నికలు బలం చేకూరుస్తాయని, పల్లెసీమల్లో జనం నాడి ఎటువైపు ఉందో తెలుస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. దీంతో అధికర టీడీపీ కూటమి పార్టీలు, ప్రతిపక్ష వైసీపీ నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అప్పుడే గ్రామాల్లో వేడి రాజుకుంది.

● ఓటర్ల జాబితా తయారు కాకపోవడమే:

ఉమ్మడి జిల్లాలో ఆయా సాగునీటి వనరులు కింద దాదాపు 9.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. 2015-16లో భూయాజ్యమాన్యం హక్కు కలిగిన ఆయకట్టు రైతులను ఓటర్లుగా గుర్తించి ఎన్నికలు నిర్వహించారు. ఆ తరువాత తొమ్మిదేళ్లు ఎన్నికలు జరపలేదు. ఈ మధ్యకాలంలో చాలామంది భూముల అమ్మకాలు చేయడంతో పాటు అన్నదమ్ములు విభాగాలు జరిగిన రెవిన్యూ రికార్డుల్లో భూయాజమాన్యం హక్కు కలిగిన రైతులు మారిపోయారు. దీంతో సాగునీటి కాలువ పరిధిలోని ఇంజనీర్లు, రెవిన్యూ అధికారులు (తహసీల్దార్లు) సమన్వయంతో ఆయకట్టు రైతులను గుర్తించి ఓటర్ల జాబితాను తయారు చేయాలి. ఇందుకు జిల్లాస్థాయి ప్రత్యేక అధీకృత రెవెన్యూ అధికారులను నియమించారు. గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం అయితే ఈ నెల 13వ తేదినాటికే ఓటర్ల జాబితా ప్రకటించాల్సి ఉండేది. అయితే.. ఓటర్ల జాబితాను ప్రకటించకపోవడం, ఈ నెల 11 నుంచి 22వ తేది వరకు అసెంబ్లీ సమావేశాలు ఉండడంతో నీటి సంఘాల ఎన్నికలు వాయిదా వేసినట్లు తెలుస్తున్నది. అసెంబ్లీ సమావేశాలు పూర్తయిన తరువాత మళ్లీ నోటిషికేషన్ జారీ చేయవచ్చని ఇంజనీర్లు పేర్కొంటున్నారు.

నీటితో నిండుగా ప్రవహిస్తున్న ఎల్లెల్సీ కాలువ ↓



● ఉమ్మడి జిల్లాలో సాగునీటి సంఘలు:

ప్రాజెక్టు	నీటి సంఘాలు
కర్నూలు జిల్లా:	
కేసీ కెనాల్	2
తుంగభద్ర ప్రాజెక్టు ఎల్లెల్సీ	58
ఆలూరు బ్రాంచి కెనాల్	6
హంద్రీ నీవా కాలువ	3
గాజులదిన్నె ప్రాజెక్టు	12
రాంపురం ఛానల్ కెనాల్	1
మైనర్ ఇరిగేషన్ చెరువులు	41
మొత్తం	123
నంద్యాల జిల్లా:	
కేసీ కాలువ	52
శ్రీశైలం కుడి కాలువ (ఎస్సార్బీసీ)	50
తెలుగుగంగ కాలువ	47
శివభాష్యం ప్రాజెక్టు	7
మైనర్ ఇరిగేషన్ చెరువులు	104
మైలవరం ప్రాజెక్టు	1
మొత్తం	261

డీఎంహెచ్‌వో, కలెక్టరేట్ ఎదుట ఆశా కార్యకర్తల ధర్నా



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట బైఠాయించిన ఆశా వర్కర్లు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆశ వర్కర్ల ఒప్పంద 60 జీవోను ప్రభుత్వం అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు పి. నిర్మల మ్మ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్ట రేట్, డీఎంహెచ్‌వో కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా అమె మా ట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సీఐటీయూ రాష్ట్ర ప్రతినిధి ఒప్పందంతో గత ఫిబ్రవరి లో ప్రభుత్వం చేసుకున్న ఒప్పంద జీవోల ను అమలు చేయాలని కోరారు. ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు నాగేశ్వరమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం పొంది ఆరు నెలలు కావస్తున్నా హామీలు అమలు చేయలేక పోవడం దారుణమన్నారు.

ముఖ గుర్తింపు హాజరుతోనే జీతభత్యాలు

కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ ఉద్యోగు లకు ముఖ గుర్తింపు హాజరు ఆధారంగానే జీతాల చెల్లింపు ఉంటుందని, ఈ మేరకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ, ఎంపీడీఓలను ఆదేశించారు. సోమవా రం కలెక్టరేట్‌లోని పీజీఆ ర్ఎస్ హాలులో ప్రజా ఫిర్యాదుల వేదికలో భాగంగా జిల్లా అధికారులతో పలు అభివృద్ధి అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ శాండ్ మేనేజ్‌మెంట్, ఎన్పీ సీఐ యాక్టివేషన్, అపార్ ఐడి జనరేషన్, హౌస్‌హోల్డ్ ఇమేజ్ జియో ట్యాగింగ్ సర్వే తదితర వాటి ఆధారంగా లక్ష్య సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్స వాల్లో శంకుస్థాపన చేసిన 1026 సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో భాగంగా 700 పనులు ప్రారంభించి 70 పనులు పూర్తి చేశారన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

చిన్నారిపై అత్యాచార యత్నం బాధాకరం

పాఠశాలలో డీఈవో విచారణ



చాగలమర్రిలో విచారణ జరుపుతున్న డీఈవో, జీసీడీవో

చాగలమర్రి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిన్నారిపై అత్యాచార యత్నం బాధాకరమని నంద్యాల డీఈవో జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం చాగలమర్రిలో బాలిక చదువుతున్న పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యంతోపాటు ఉపాధ్యాయులు, చిన్నారి తల్లిదండ్రులతో పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని అన్నారు. పోలీసు అధికారులను కలిసి జరిగిన సంఘటనపై వివరాలు తెలుసుకుంటామని చెప్పారు. విచారణ జరిపిన నివేదికలను కలెక్టర్, విద్యాశాఖ కమిషనర్‌కు అందజేస్తామని అన్నారు. ఈ విచారణలో జీసీడీవో నాగసువర్చల, డిప్యూటీ డీఈవో బేగ్, ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి గుర్తు తెలియని మహిళ మృతి

కర్నూలు నవంబరు, (ఆంధ్రజ్యోతి): కర్నూలు రైల్వే స్టేషన్ పరిధిలో కర్నూలు దూపాడు మధ్యలో రైలు నుంచి జారి పడి ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎస్.ఐ కిరణ్ సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి వయస్సు 60 ఏళ్లు ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. శరీరంపై పసుపురంగు చీర మీద నీలం రంగు పూల డిజైన్ ఉంది. రెండు చేతులపైన పూల డిజైన్ పచ్చబొట్లు ఉన్నాయి. చేతి వేలికి లక్ష్మీదేవి బొమ్మ ఉన్న రాగి ఉంగరం ఉంది. అలాగే కుడిచేతికి నాలుగు వెండి కడియాలు ఉన్నాయి. మృతురాలి వివరాలు తెలిసిన వారు 9440627654 నెంబరుకు ఫోన్ చేయాలని రైల్వే సీఐ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

పప్పు శనగ పండేనా?

● రాలుతున్న పూత ● ఆందోళనలో రైతులు

ఓర్వకల్లు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శనగ పంటకు మొగలి మంచు ప్రమాదకరంగా మారింది. మంచుతో పూత పూర్తిగా రాలిపోతుండటంతో దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా పడటంతో మండలంలో అత్యధికంగా శనగ పంట సాగు చేశారు. ఎకరాకు రూ.వేల పెట్టుబడి పెట్టినా పంట కళ్లెదుటే పూత రాలిపోతుండటంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మొగలి మంచు ఈ ఏడాది అధికంగా ఉంది. మండలంలోని కన్నమడకల, ఓర్వకల్లు, పూడిచెర్ల, తిప్పాయపల్లె, హుశేనాపురం, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, గుట్టపాడు, మీదివే ముల తదితర గ్రామాల్లో 5000 ఎకరాల్లో శనగ పంటను సాగు చేశారు. అలాగే పురుగు దెబ్బతో మొక్కలు కూడా ఎండిపోతున్నాయి. గత ఏడాది ఎకరాకు 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని, ఈ ఏడాది 6 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి వచ్చే పరిస్థితి కూడా లేదని రైతులు అంటున్నారు. ఎకరాకు రూ.15వేలు పెట్టుబడి పెట్టారు. ఎకరా కౌలుకు రూ.10వేలు చెల్లించారు. గత మూడేళ్ల నుంచి దిగుబడి అంతంత మాత్రంగానే వచ్చిందని గిట్టుబాటు ధర కూడా లేదన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయామని వాపోతున్నారు. అలాగే గత ఏడాది మద్దతు ధర లేకపోవడంతో ఇప్పటికి గోదాముల్లోనే శనగలు నిల్వ ఉంచారు. ఈ ఏడాది కూడా ధర అంతంతంగా మాత్రంగానే ఉంటుందని, పంటపై చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి మద్దతు ధర రూ.8వేలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.


పూత రాలిపోతున్న పప్పుశనగ పంట ఇదే

తీవ్రంగా నష్టపోతున్నాం



తాను 20 ఎకరాల్లో కౌలుకు తీసుకున్నా. ముందే రూ.2 లక్షలు చెల్లించాను. పెట్టుబడి రూ.1.50 లక్షలు పెట్టాను. ఎకరాకు 4 క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. పంట సాగు చేసి 60 రోజులు కావస్తుంది. కాయలు కనిపించడం లేదు. ఉన్న పూత కూడా మొగలి మంచుతో రాలిపోతుంది. మార్కెట్‌లో కూడా ధర లేదు.
- రోళ్లపాడు మద్దిలేటి, రైతు

పూత నేలపాలవుతోంది..



రబీలో వర్షాలు బాగా కురువడంతో పంటలు సాగు చేశాం. మొగలి మంచు, పురుగు దెబ్బతో చెట్టుకున్న పూత నేలపాలైతుంది. రైతులకు తీవ్ర నష్టం వాటి ల్లింది. చెట్టుకు కాయలు లేవు. పంటలు చూడడానికి పచ్చగా కళకళలాడుతున్నా లాభం లేదు. మొక్కలు కూడా పురుగు దెబ్బతో వాడిపట్టి ఎండిపోతున్నాయి.
- అబ్దుల్లా, రైతు

సమస్యలు పరిష్కరించాలి: కమిషనర్


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించాలని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి 19 అర్జీలను కమిషనర్ స్వీకరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్య అధికారి కే.విశ్వేశ్వరరెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంఈ సత్యనారాయణ, ఆర్‌ఓ జునైద్, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, పాల్గొన్నారు.

సి.బెళగల్: ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని వీఆర్వోలను హెచ్చరించారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు రోడ్డు, పాత ఈద్గా, కల్లూరు రోడ్డు తదితర ప్రాంతాలలో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. కాలువల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని, చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఉస్మానియా కళాశాలలో పర్యటించారు. కార్పొరేటర్లు యూనుస్‌బాషా, జుబైర్‌లు మైదానంలో సమస్యలను కమిషనర్‌కు వివరించారు. మైదానంలో మొక్కలు తొలగించాలని, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేందుకు వాకింగ్ ట్రాక్ నిర్మించాలని కోరారు.

నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి: వెంకటరమణ కాలనీలో నిర్మించిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలు దక్కించుకుని ఇప్పటి వరకు ప్రారంభించని యజమానులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కమిషనర్ రవీంద్ర బాబు అన్నారు. సోమవారం షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. కొన్ని షాపులు ఖాళీగా ఉండటంపై ఆయన ఆరా తీశారు. ఆనంద్ థియేటర్ సమీపంలో కేసీ కెనాల్ వంతెన వద్ద నూతనంగా నిర్మిస్తున్న సీసీ డ్రైనేజీని కమిషనర్ పరిశీలించారు. ఆయన వెంట అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ఆర్‌ఓ జునైద్, సూపరింటెండెంట్ వాజిద్, డీఈఈ క్రిష్ణలత, ట్రైనీ ఏఈ ప్రవీణ్ ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్యశిబిరాలను వినియోగించుకోవాలని కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ప్రజలకు సూచించారు. మాజీ గ్రంథాలయ చైర్మన్ కేజీ గంగాధర్‌రెడ్డి సహకారంతో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి సోమిశెట్టి హాజరై కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీ గంగాధర్‌రెడ్డి ఇప్పటి వరకు ఎన్నో ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించారని కొనియాడారు.

టీడీపీతోనే కార్యకర్తలకు న్యాయం


సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీడీపీ నాయకులు

గూడూరు నవంబరు 18(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు అన్నారు. సోమవారం గూడూరులోని పదో వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రేమట వెంకటేష్, పౌలు, తెలుగు శ్రీనివాసులు, కౌన్సిలర్ బుడ్డంగలి, మన్సూన్ బాషా, చెంచుల విజయ్ కుమార్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

'సూర్యఘర్ యోజన'ను అమలు చేయండి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐదు గ్రామాల్లో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని అమలుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. సోమవారం విజయవాడ నుంచి ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న అన్ని కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రద్యుమ్న మాట్లాడుతూ సూర్యఘర్ యోజన పథకానికి బ్యాంకులు సులువుగా లోన్లు మంజూరు చేస్తాయని తెలిపారు. ఒక కిలోవాట్‌కు రూ.30,000, రెండు కిలోవాట్‌కు రూ.60,000, మూడు కిలోవాట్‌కు రూ.78,000 కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో తిరిగి చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రంజిత్ బాషా, ఏపీ ఎస్పీడీసీఎల్‌ఎస్‌ఈ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

కర్నూలు రూరల్ నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలంలో మంగళవారం నుంచి ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రఘునాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల, కళాశాలలో చదివే విద్యార్థుల సౌలభ్యం కోసం ప్రభుత్వం అపార్ ఎంట్రీ నమోదు కార్యక్రమం చేపట్టడంతో ప్రతి ఆధార్ కేంద్రాలకు గ్రామాల నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు కర్నూలుకు వస్తున్నారని, ఈనేపథ్యంలో ప్రభుత్వం అలాంటి వారిని దృష్టిలో ఉంచుకొని ఆధార్ మార్పులు, చేర్పుల కోసం గ్రామాల్లోనే క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈక్యాంపులు నేటి నుంచి నాలుగు రోజులపాటు ఉంటాయని, మండలంలో ఉల్చాల, పంచలింగాల, ఈ.తాండ్రపాడు, నిడ్జూరు, గార్గేయపురం, గొందిపర్ల, రేమట, తొలిశాపురం, బసవాపురం, నందనపల్లె, పసుపుల గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

రేపు జాబ్ మేళా

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ, సీడాప్ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా బుధవారం నిరుద్యోగ యువతీ యువకులకు టీటీడీసీ ట్రైనింగ్ సెంటర్ బి.తాండ్రపాడులో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నాగశివలీల ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు వ్యాయామ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

కర్నూలు కల్చరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కర్నూలు నియోజక వర్గ వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం మంగళవారం నగరంలోని టౌన్ మోడల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు కర్నూలు నియోజకవర్గం ఇన్‌చార్జి ఎం.విజయకుమార్, కర్నూలు మండల ఇన్‌చార్జి ఎం.పుల్లన్న తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు వ్యాయామ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం విద్యాశాఖ నిర్ణయించిన అజెండా ప్రకారం ఉదయం 8.45 గంటల నుంచిసాయంత్రం 4.45 గంటల వరకు ఉంటుందని వారు పేర్కొన్నారు.

మాదిగ ఉద్యోగులు ఐక్యంగా ఉండాలి

ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి బిక్షాలు మాదిగ


మాట్లాడుతున్న దేవరపల్లి బిక్షాలు మాదిగ

కర్నూలు రూరల్ నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మాదిగ ఉద్యోగులంతా కలిసి మెలిసి ఐక్యంగా ఉండాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్య క్షుడు దేవరపల్లి బిక్షాలు మాదిగ అన్నారు. స్థానిక సి.క్యాంపులోని టీజీవీ కళాక్షేత్రంలో సోమవారం ఎంఈఎఫ్ జిల్లా ఇన్‌చార్జి జీసీ సుబ్బరాయుడు అధ్యక్షతన నిర్వహించిన మాదిగ ఉద్యోగుల కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి బిక్షాలు మాదిగ హాజరై మాట్లాడారు. గ్రామాల్లో మాదిగ జాతి అభివృద్ధి చెందాలంటే మాదిగ ఉద్యోగులంతా ఏకతాటిపై నిలిచి జాతి ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.నాయకంటి మద్దయ్య మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ ఉద్యమ ఫలితంగా ఈరోజు ఎస్సీ వర్గీకరణను సుప్రీంకోర్టు ద్వారా సాధించుకున్నామన్నారు. అనంతరం కర్నూలు జిల్లా మాదిగ ఉద్యోగుల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా చిన్ననారాయణ మాదిగ, సురేంద్రనాథ్, శ్రీనివాసులు గౌరవ అధ్యక్షులుగా ప్రకాష్ రాజ్ మాదిగ, మజిల్, జిల్లా అధ్యక్షులుగా ప్రదీప్‌కుమార్ మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ తిమ్మరాజు మాదిగ, జనరల్ సెక్రటరీ పసుపుల శ్రీరాములు, కోశాధికారి అడ్డాకుల సురేష్‌తోపాటు మరికొంతమంది ఉద్యోగులను ఎన్నుకున్నారు.

కార్తీక మాస పూజలు


సామూహిక పూజలు చేస్తున్న మహిళలు

కర్నూలు కల్చరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా నగరంలోని వివిధ ఆలయాల్లో కార్తీక సోమవార పూజలు నిర్వహించారు. సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో శివాలయంలో, వేంకటేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం మహిళలు సామూహిక దీపాలు వెలిగించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సందెల్ చంద్రశేఖర్, నాగులవరం రాజశేఖర్ భక్తులకు ఏర్పాట్లు చేశారు. వన్‌టౌన్‌లోని చిత్తారి వీధిలోగల నిమిషాంబాదేవి ఆలయంలో మహిళలు సామూహిక దీపారాధన, తదితర పూజలు నిర్వహించారు. అశోక్ నగర్‌లోని హనుమాన్ ద్వారకామాయి దేవాలయం, మల్లికార్జున సాయి ఆలయం, వెంకటరమణ కాలనీలోని సాయి మందిరం, పాతనగరంలోని శివాలయం, దక్షిణ షిరిడీ ఆలయాల్లో జరిగిన కార్తీక సోమవారం పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా భక్త కనకదాసు జయంతి


భక్త కనకదాసు చిత్రపటం వద్ద నాయకులు

గూడూరు నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంచికలపాడు గ్రామంలో భక్త కనక రామదాసు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం భక్త కనక రామదాసు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మద్దిలేటి, మాజీ ఎంపీటీసీ కృష్ణ, కర్ణం చిన్న గిడ్డయ్య, నాగేష్, బంగారు శ్రీనివాసులు, యుంగధర్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన


కలెక్టర్ రంజిత్‌బాషాతో క్రీడాకారులు

కర్నూలు కల్చరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కనోయింగ్, కయాకింగ్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 17 వరకు నంద్యాల జిల్లా కేంద్రంలోని చిన్న చెరువులో నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్స్ డ్రాగన్ బోట్ పోటీలు మిక్స్‌డ్ విభాగంలో జిల్లా క్రీడాకారులు మూడో స్థానంలో నిలిచారని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు తెలిపారు. సోమవారం కలెక్టర్ పి.రంజిత్‌బాషా తన కార్యాలయంలో గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్రీడాకారుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. జిల్లా వాటర్ స్పోర్ట్స్ శిక్షకుడు చంద్రశేఖర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

గూడూరు నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతుల భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కె కృష్ణ కోరారు. సోమవారం గూడూరులో తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ రామాంజనేయులుకు రైతుల సమస్యలపై టీడీపీ నాయకుడు కె.కృష్ణ వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో రీ సర్వేలో రైతుల భూములకు సంబంధించి విస్తీర్ణం ఆన్‌లైన్‌లో ఎక్కువ, తక్కువ చూపించడం, జాయింట్ ఎల్‌పీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి

కాల్వబుగ్గ అభివృద్ధికి రూ.12 కోట్ల ప్రతిపాదన

స్పందించిన టీటీడీ చైర్మన్


టీడీపీ చైర్మన్, ఈవోకు వినతిపత్రం ఇస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాల్వబుగ్గ రామేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి నిధులు కేటాయించాలని టీటీడీ పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ కోరారు. సోమవారం తిరుమల తిరుపతి దేవస్థానం ప్రాంగణంలోని అన్నమయ్య భవనంలో జరిగిన టీటీడీ పాలక మండలి బోర్డు సమా వేశంలో చైర్మన్ బీఆర్.నాయుడు, ఈఓ శ్యామలరావులకు రూ.12 కోటట్లో చేపట్టే అభివృద్ధికి పనులకు ప్రణాళికలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కాల్వబుగ్గ దేవస్థానంలో జరిగే అభివృద్ధి పనుల వివరాలను మల్లెల రాజశేఖర్ వెల్లడించారు. ఈ నిధులు మంజూరు చేసి కాల్వబుగ్గ క్షేత్రం అభివృద్ధికి కృషి చేయాలని టీటీడీ బోర్డు అధికారులకు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.

సర్వేను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న శ్రీనివాసులు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వైద్య శాఖ చేస్తున్న కమ్యూనికబుల్ డీసీజెస్(ఎన్‌సీడీ) 3.0ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని గడ్డ అర్బన్ హెల్త్ సెంటర్‌లో పరిధిలోని 15వ సచివాలయంలో జరుగుతున్న ఎన్‌సీడీ 3.0 సర్వేలో క్యాన్సర్, బీపీ, మధుమేహం తదితర పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆహారంలో ఉప్పు ఎక్కువ తీసుకోవడం, శరీరక శ్రమ లేకపోవడం, గంటల తరబడి కూర్చొని పని చేయడం, ఒత్తిడితో రక్తపోటు వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం ఏఎన్‌ఎం నిర్వహిస్తున్న ఇంటింటి స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటి డెమో చంద్రశేఖరరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, సచివాలయం ఆరోగ్య కార్యకర్త కే. అరుణ కుమారి, ఖలీల్ పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న కృష్ణ

గూడూరు నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి కృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని గూడూరుతోపాటు గుడిపాడు, చనుగొండ్ల గ్రామాల్లో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి కృష్ణ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి శేషు కుమార్, సీపీఐ మండల కార్యదర్శి బీడీల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న వారికి 3 సెంట్లు, పట్టణాల్లో ఉన్న వారికి 2 సెంట్లు ఇవ్వాలన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి: ఏవో

సి.బెళగల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ రైతులకు సూచించారు. సోమవారం మండల వ్యవసాయ కార్యాలయంలో రైతులతో ఆయన మాట్లాడుతూ విత్తనశుద్ధి లేకుండా విత్తనాలు వేస్తే అనుకున్న దిగుబడి రాదని అన్నారు. రబీ అనంతరం భూసార పరీక్షలు తప్పనిసరి చేయించుకోవాలన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి: ఉపకులపతి


మాట్లాడుతున్న ఉపకులపతి ఎన్‌టీకే నాయక్

కర్నూలు అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీ సెనేట్ హాలులో మెడికవర్ హస్పిటల్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యం అన్న మాట అక్షరాల సత్యమన్నారు. రిజిస్ట్రార్ విజయకుమార్ మాట్లాడుతూ బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు చేయించుకోవడం ద్వారా శరీరంలో జరుగుతున్న మార్పులను తెలుసుకొని తగు జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ పి.నాగరాజు, వెంకటరత్నం, విజయుడు, నాగచంద్రుడు, శివప్రసాదరెడ్డి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్ కమిటీలో ఎంపీ నాగరాజు


ఎంపీ బస్తిపాటిని అభినందిస్తున్న దృశ్యం

కర్నూలు అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అధ్యయన పర్యటన నిర్వహించింది. సోమవారం హైదరాబాద్‌లో కమిటీ చైర్మన్ కనిమొళి, కరుణానిధి, ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ముందుగా ఇండియన్, భారత్, హిందూ స్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. చక్కెర, చెరుకు, ధాన్యాలు, ఇథనాల్, జీవ ఇంధన ఉత్పత్తిపై చర్చించారు. తెలంగాణ, ఏపీ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, దక్షిణ, మధ్యరైల్వే ప్రతినిధులతో చర్చించారు. ఎంపీ బస్తిపాటి మాట్లాడుతూ కరువు పీడిత ప్రాంతం అనే నేపథ్యంలో భారత ఆహార సంస్థ కార్యాలయాన్ని కర్నూలులో పెట్టారని, గత వైసీపీ ప్రభుత్వం ఆ కార్యాలయాన్ని అనంతపురానికి తరలించేందుకు ప్రయత్నాలు చేసిందని అన్నారు. ఎఫ్‌సీఐ సంస్థ కార్యాలయాన్ని కర్నూలులోనే కొనసాగించాలని ప్రతినిధులను ఆయన కోరారు

వైభవంగా సత్యసాయిబాబా జయంతి


సామూహిక సత్యసాయి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని నెహ్రూ నగర్‌లోగల భగవాన్ పుట్టపర్తి సత్యసాయిబాబా మందిరంలో సత్య సాయి బాబా 99వ జయంతి వేడుకలు సోమవారం వైభవంగా ఆరంభమయ్యాయి. ఈ వేడుకల్లో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈనెల 23 వరకు కొనసాగే జయంతి వేడుకల్లో భాగంగా తొలిరోజు సోమవారం మందిరంలో సత్యసాయి వ్రతాన్ని భక్తులతో నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కర్నూలు కోఆర్డినేటర్ మాకా అశోక్‌కుమార్, ఇతర ప్రతినిధులు సంధ్య, సాయిబాబా పాల్గొన్నారు.

కేతవరం గ్రామాన్ని అభివృద్ధి చేయండి


సమావేశంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆదిమానవులు సంచరించిన కేతవరం గ్రామాన్ని అభివృద్ధి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కే ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం కేతవరం శాఖ 11వ మహాసభ పార్టీ సీనియర్ సభ్యుడు బి వెంకటేశ్వర్లు అధ్యక్షతన కేతవరంలో జరిగింది. ఈ సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కే ప్రభాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ దేశాయ్, కార్యదర్శి వర్గ సభ్యుడు జిరామకృష్ణ, మధు, నాగన్న, శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

సి.బెళగల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా సి.బెళగల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు సోమవారం హెచ్‌ఎం బాషా ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రంథాలయ నిర్వాహకుడు రమణ మాట్లాడుతూ విద్యార్థులకు గ్రంథాలయాలపై అవగాహన అవసర మన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ పాండు రంగన్న, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన డైరెక్టర్


ఉండవల్లి శ్రీదేవితో డైరెక్టర్ జేమ్స్

కర్నూలు అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవిని మర్యాదపూర్వకంగా డైరెక్టర్‌గా ధరూర్ జేమ్స్ కలిశారు. విజయవాడలో నూతనంగా మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గా ఎంపికైనందుకు తన పదవీకి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

ఆదోని టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ పొలిమేరలో ఉన్న సయ్యద్ షా తాహిర్ ఖాద్రి ఉరుసు సందర్భంగా భక్తులకు సౌకర్యాలు కల్పించాలని మాతా శిశు ఆస్పత్రి సలహా సంఘం మాజీ సభ్యుడు నసీరుద్దీన్ పటేల్ డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కోరారు. అలాగే వీధి దీపాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను కోరారు.

ఆర్టీసీ బస్టాండును శుభ్రం చేశారు


బస్టాండును శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

మద్దికెర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను పంచాయతీ అధికారులు శుభ్రం చేయించారు. సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ఆర్టీసీ బస్టాండ్' శీర్షికన ప్రచురించిన కథనానికి సర్పంచ్ సుహాసిని, కార్యదర్శి శివకుమార్ స్పందించి, సిబ్బందిని పంపారు. మందుబాబులు వాడుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక నుంచి రోజూ బస్టాండును శుభ్రం చేయిస్తామ న్నారు. సలహాదారులు అంజినేయలు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



ఆలూరు సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

ఆలూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వ్యకాసం నాయకులు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆలూరు సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కాక భూపేష్, తాలూకా కార్యదర్శి రంగన్న, ఎస్ఎస్ బాషా మాట్లాడుతూ పేదలు ఇళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో పేదలకు 3సెంట్లు స్థలాలిచ్చి, గృహ నిర్మాణానికి రూ.5లక్షలు సాయం చేయాలని కోరారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందచేశారు. సిద్ధలింగ, దుర్గప్ప, జాఫర్, ప్రభావతి, మంగమ్మ, పాతిమ్మ పాల్గొన్నారు.

రిజర్వేషన్ ప్రకారం దుకాణాల వేలాలు


దుకాణాల వివరాలు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో, సర్పంచ్

ఆలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 27 దుకాణాలకు ఈనెల 21న నిర్వహించనున్న వేలంలో రిజర్వేషన్ ప్రకారం లాటరీ విధానం అమలు చేస్తామని డీఎల్‌పీవో వీరభద్రప్ప సోమవారం తెలిపారు. ఎస్సీ-4, ఎస్టీ-2 బీసీ-8 చొప్పున కేయిస్తామన్నారు. సర్పంచ్ అరుణాదేవి, మీడియా సమక్షంలో వివరాలు వెల్లడించారు. మిగిలిన 14 దుకాణాలకు అన్ని క్యాటగిరి వాళ్లు వేలం పాటలు పాడవచ్చన్నారు.

మరుగుదొడ్లు నిర్మించుకోవాలి

హాలహర్వి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని ప్రత్యేకాధికారి రామాంజనేయులు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల 19న ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం నిర్వహించాలన్నారు. ఎంపీడీవో వరలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

తుగ్గలి , నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల స్థలాలిచ్చి ఇళ్లు కట్టించి ఇవ్వాలని సీపీఐ కార్యవర్గ సభ్యుడు సుల్తాన్, కార్మిక సంఘం నాయకులు నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం చెన్నంపల్లి, బొందిమడుగుల, కడుముకుంట్ల గ్రామాల్లో సచివాలయాలవద్ద ధర్నా నిర్వహించి, కార్యదర్శులకు వినతి పత్రాలను అందజేశారు. ఇప్పటికే ఇంటి స్థలం ఉన్నవారికి రూ.5 లక్షలు మంజూరు చేస్తే ఇళ్లు నిర్మించుకుంటా రన్నారు. రోళ్లపాడు వెంకటేష్, చదువుల కాశి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం

ఆదోని రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెద్దతుంబళం - కుప్పగల్లు సమీపంలోని ఎల్లెల్సీలో గుర్తు తెలియని మగ మృతదేహం లభ్యమైందని పెద్దతుంబళం ఎస్ఐ మహేష్ కుమార్ సోమవారం తెలిపారు. గుర్తు పట్టలేని స్థితిలో ఉందన్నారు. చేతికి కాషాయ దారం ఉందన్నారు.

చికిత్స పొందుతూ మృతి

ఆదోని రూరల్ నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెద్దహరివాణంకు చెందిన పంపాపతి(52) చికిత్స పొందుతూ, మృతి చెందాడు. ఈనెల 14వ తేదిన శిరుగుప్ప రహదారిలోని ఎల్లెల్సీ వద్ద బైక్‌నుంచి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. కర్నూలులో చికిత్స పొందుతున్న కోలుకోలేక మృతి చెందినట్లు ఇస్వీ ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

వేదవతి కోసం ఉద్యమిస్తాం

ఆలూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాయలసీమకు జరుగుతున్న అన్యాయాన్ని నివారించేందుకు వేదవతి రిజర్వాయర్ సాధన కోసం ఉద్యమాలను ఉధృతం చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జ్యోతిబసు భవన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో మండల కార్యదర్శి షాకీర్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో కాంగ్రెస్, సీపీఐ, బీఎస్పీ తదితర రాజకీయ పక్షాల నాయకులు పాల్గొన్నారు. 8 టీఎంసీల సామర్థ్యంతో వేదవతి రిజర్వాయర్ నిర్మాణానికి 2024-25 బడ్జెట్‌లో 500 కోట్లు కేటాయించాలని, లేనిపక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు హనుమంతు, కేపీ నారాయణ స్వామి, వెంకటేశులు, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్ణ, రామాంజనేయులు, గోవిందు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

ఆఖరి మజిలీకి అవస్థలు

- శ్మశాన స్థలంలో డంప్‌యార్డు, ఇళ్లు
- దుర్వాసన, ఇరుకు దారితో ప్రజల అవస్థలు


శ్మశానంలో ముళ్లకంప, ఇన్‌సెట్‌లో డంప్‌యార్డు

మద్దికెర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పందుల కుంట సమీపంలో 53, 57/2, 61బీలో ప్రభుత్వం హిందూ శ్మశానానికి ఐదెకరాలను కేటాయించింది. కానీ ఇప్పటికే రెండెకరాలు కబ్జా కాగా, మూడెకరాలు మాత్రమే మిగిలింది. మద్దికెర మేజర్ గ్రామ పంచాయతీలో 18 వార్డులు ఉండగా, 20వేల జనాబా ఉంది.

శ్మశానంలో చెత్త..

అయితే శ్మశాన వాటికలోనే చెత్తను డంపింగ్ చేస్తున్నారు. దీంతో దహన సంస్కారాలకు వచ్చినవారు ఇబ్బందులు పడుతున్నారు. శ్మశాన స్థలంలో ముళ్ల కంప ఉండటంతో వాటిని తొలగించి మృతదేహాలను పూడ్చుతున్నారు.

రోడ్డుకు ఇరువైలా చెత్త..

దారిలో రోడ్డుకిరువైపులా చెత్త ఉండటంతో అంత్యక్రియలకు వెళ్లేవారికి ఇబ్బంది కలుగుతుంది. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ముళ్లకంప ఉండటంతో దారి మూసుకు పోయింది. ఎక్కడ అంత్యక్రియలు చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

శ్మశాన స్థలంలో గృహాలు

శ్మశాన స్థలంలో రెండెకరాల్లో కబ్జా చేసి గృహాలు నిర్మించుకున్నారు. స్థలం కబ్జా అవుతోందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఆక్రమణదారులు మరింత ముందుకు వస్తున్నారు. దారిలో రాళ్లు అడ్డంగా పెట్టడంతో నడవలేని పరిస్థితి ఉంది. ఆఖరి మజిలీలో కూడా ప్రశాంతంగా లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి శ్మశాన స్థలం కబ్జా కాకుండా చూడాలని, డంపింగ్ యార్డును ఇతర ప్రాంతాలనికి తరలించాలని కోరారు.

ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ను వివరణ కోరగా డంపింగ్ యార్డును తరలించడానికి స్థలం సేకరిస్తున్నామని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు.

చెత్తను తొలగించాలి



శ్మశానంలో చెత్తతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అంత్యక్రియలకు వెళ్లిన సమయంలో పొగ వస్తుంది. చెత్తను తొలగించాలి **- రమేష్, మద్దికెర**

'దేవర' అర్ధ శత దినోత్సవం

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా విడుదల 50 రోజుల వేడుకను సోమవారం సత్యం సినీ కాంప్లెక్స్‌లో అభిమానులు జరుపుకున్నారు. ఎన్టీఆర్ అభిమాన సంఘం కన్వీర్ ముజీబ్ అహ్మద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అభిమానులకు అందజేశారు. ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా రూ.కోటి గ్రాస్ దాటిందని అన్నారు. అనంతరం కర్ణాటక అభిమాన సంఘం నాయకులు బసవకు థియేటర్ జయమానికి మెమెంటోను అందజేశారు. అభిమానులు, మాజీ కౌన్సిలర్ తిమ్మప్ప, గోనబావి గోపాల్, చాంద్ పాల్గొన్నారు.

ఇద్దరి అరెస్టు

ఆదోని రూరల్ నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విరుపాపురంకు చెందిన ఆంజనేయులు, దిబ్బనకల్లుకు చెందిన వీరేష్‌ను తాలుక పోలీసులు అరెస్టు చేశారు. వివరాల మేరకు.. వీరి వద్ద నుంచి 200 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్.ఐ రామాంజనేయులు తెలిపారు.

సమస్యలను వేగంగా పరిష్కరించండి

- ఎమ్మెల్యే సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్
- ప్రజల నుంచి అర్జీల స్వీకరణ


అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్‌లో మండలాల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మండలంలోని అధికారులు సమస్యలను గడువులోపు పరిష్కరించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు.

మండలాల నుంచి వచ్చిన సమస్యలు కొన్ని

1. గ్రామంలో తాగునీటి పైపు మరమ్మతులకు గురికావడంతో నీరు రావడం లేదని మరమ్మతులు చేసి తాగునీరు అందించాలని 104 బసాపురం గ్రామ ప్రజలు అర్జీ సమర్పించుకున్నారు.

2.ఆదోని మండలం నెట్టేకల్ గ్రామానికి చెందిన రామాంజినేయులు తనకు సర్వే నెంబర్ 113లో 1.57ఎకరాల భూమి పెద్దల నుంచి వచ్చిందని, ఆన్‌లైన్‌లో వేరే వారి పేరుందని, విచారణ చేసి తనపేరు ఎక్కించి, పట్టాదారు పుస్తకం మంజూరు చేయవలసినదిగా ఆర్జీ సమర్పించుకున్నారు.

3. ఆదోని మండలం గణేకల్లు గ్రామంలో రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభం ఉందని తొలగించాలని గ్రామానికి చెందిన పెద్ద విరుపాక్షి అర్జీ సమర్పించుకున్నారు.

4. ఆదోని మండలం కుప్పగల్ గ్రామానికి ఆంజనేయులు తనకు సర్వే నెంబర్ 178/1లో ఎకరా భూమి కొనుగోలు చేశానని, అయితే ఆన్‌లైన్‌లో వేరే వారి పేరుందని, విచారణ చేసి ఆన్‌లైన్‌లో తన పేరు ఎక్కించాలని

అర్జీ సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏవో వసుంధర, సర్వేయర్స్ శ్రీనివాసరాజు, వేణు సూర్య, డీఎల్‌డీపీవో, నూర్జహాన్, డీఎల్‌డీవో ప్రభాకర్ రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, హౌసింగ్ డీఈ రవికుమార్, ఆర్‌అండ్‌బీ డీఇ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దోబీ పోస్టులను రజకులకే కేటాయించాలి


చైనర్‌పర్సన్‌కు సమస్యలు విన్నవిస్తున్న రజక మహిళలు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో దోబీ పోస్టులను రజకులకే కేటాయించాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముక్కన్న నాయకులు కవిత, అనసూయ డిమాండ్ చేశారు. రజక కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన సావిత్రిని సోమవారం సన్మానించారు. ప్రభుత్వం ఆధునిక యంత్రాలు ఇచ్చేలా చూడాలన్నారు. రజకులకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని అమలు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. దేవదాయ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ల్యాండ్రీలకు ఉచిత విద్యుత్ అందించి పీఎం విశ్వకర్మ పథకం అందేలా చూడాలని కోరారు. శ్రీనివాసులు, జయమ్మ, సావిత్రి, నాగరత్న, ప్రియాంక, సుధ పాల్గొన్నారు.

తోపుడు బండ్లు ఉంచవద్దు

పత్తికొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రోడ్డుకిరువైపులా తోపుడు బండ్లను ఉంచవద్దంటూ చిరువ్యాపారులకు పోలీసు, పంచాయతీ అధికారులు హెచ్చరికలు జారీచేశారు. సోమవారం ఈవో నరసింహులు ,ఏఎస్ఐ శివాజీ నాయక్, సిబ్బంది తోపుడుబండ్ల వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ సమస్య ఉత్పతన్నమవుతుందని, తొలగించాలన్నారు. ఈవో నరసింహులు మాట్లాడుతూ పత్తికొండ సివిల్ కోర న్యాయాధికారి ఆదేశాల మేరకు పట్టణంలోని ఉరువాకిలి ప్రాంతం నుంచి గుత్తి సర్కిల్ వరకు తోపుడు బండ్లు పెట్టరాదని చిరువ్యాపారులకు ఉత్తర్వులు ఇచ్చిన్నట్లు తెలిపారు.


చిరువ్యాపారులను హెచ్చరిస్తున్న ఈవో

సారా తయారీకి బెల్లం విక్రయిస్తే చర్యలు

- వ్యాపారులను హెచ్చరించిన సీఐ లలిత


వ్యాపారులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ లలిత

ఆలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ప్రాంతాల్లో సారా తయారీకి అధిక మొత్తంలో బెల్లం విక్రయిస్తే చర్యలు తప్పవని ఆలూరు ఎక్సైజ్ సీఐ లలిత హెచ్చరించారు. సోమవారం ఎక్సైజ్ స్టేషన్‌లో కిరాణా వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఎవరైనా అధిక మొత్తంలో బెల్లాన్ని కొనుగోలు చేసేత వారి వివరాలు అందించాలన్నారు. అలాగే ఎవ్వరికి ఎంత బెల్లం విక్రయిస్తున్నారో నమోదు చేసి, రశీదులు ఇవ్వాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.

నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపేస్తాం : ఈఈ


సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఈఈ మద్దన్న

మద్దికెర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి నిధులతో వేస్తున్న సీసీ రోడ్డు పనులలో నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపివేస్తామని పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ మద్దన్న హెచ్చరించారు. ఈ నెల 16న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'సీసీ రోడ్డు నాసిరకంగా వేస్తున్నారు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఈఈ మద్దన్న సోమవారం రోడ్డును పరిశీలించారు. నిబంధనల మేరకు సీసీ రోడ్డు ఉండాలని, కంకర, సిమెంటు కొలతల ప్రకారం వాడాలన్నారు. అవినీతి జరిగితే వదిలే ప్రసక్తి లేదన్నారు. మండ లంలో ఇప్పటివరకు రూ.1.30కోట్ల పనులు చేశామని మిగతా పనులను కూడా చేస్తామ న్నారు. డీఈ శేషయ్య, ఏఈ విష్ణు, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడురు ధనుంజయుడు, నాయకులు శాంతిరెడ్డి, గోపాల్ ఉన్నారు

మినిమం టైం స్కేల్ అమలు చేయాలి


సెక్రటరీకి వినతిపత్రం అందిస్తున్న వార్డెన్లు

ఆలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మోడల్ హాస్టల్, గర్ల్స్ హాస్టల్ (కేజీబీవీ టైప్-4)లో ఔట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న వార్డెన్లకు మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని వార్డెన్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సుధారాణి, సుమలత కోరారు. సోమవారం విజయవాడలో స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో కేజీబీవీ సెక్రటరీ దేవానంద్ రెడ్డి, ఎఎస్ పీడీ ప్రసన్న కుమార్‌కు వినతిపత్రం అందించారు. కరోనా కాలం నాటి వేతనాలు మంజూరు చేయాలని, ఎనిమిదేళ్లుగా 24గంటలు విధులు నిర్వహిస్తున్న వార్డెన్‌ల సేవలను, విద్యార్హతలను పరిగణనలోకి తీసుకుని, కాంట్రాక్టు విధానంలోకి మార్పు చేయాలన్నారు. స్పందించిన అధికారులను ప్రభుత్వం దృష్టికి తీసుకకెళ్తామని హామీ ఇచ్చారు. వార్డెన్లు రమదేవి, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ

తుగ్గలి , నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రామలింగేశ్వర ఆలయం విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. సోమవారం బోడిబండలో భక్తులు చందాలు వేసుకుని రూ.కోటి రూపాయలతో నిర్మించిన నూతన ఆలయాన్ని ప్రారంభించారు. అలాగే అయోధ్యతో బాల రాముని విగ్రహన్ని చెక్కిన శిల్పితో తయారు చేయించిన విగ్రహంతో పాటు నందీశ్వరుడు, తదితర విగ్రహాలను కూడ ప్రతిష్ఠించారు.

సమస్యలు పరిష్కరించాలి


కమినర్‌కు నతిపత్రం ఇస్తూ..

ఆదోని టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిజాముద్దీన్ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని 40వ వార్డు కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ సోమవారం కమిషనర్ కృష్ణకు వినతి పత్రం ఇచ్చారు. పక్కా రోడ్లు, కాలువలు లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, ఎన్టీఆర్ కాలనీలో మహిళల సామూహిక మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. ప్రజలు వ్యక్తిగత మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారని తెలిపారు.

సొసైటీలతో రైతుల అభివృద్ధి : సీఈవోలు

తుగ్గలి , నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సహకార సొసైటీలతో రైతుల అభివృద్ధి చెందుతారని ఉప్పర్లపల్లి, మారెళ్ళ సొసైటీల సీఈలు గిడ్డయ్య, మనోహర్ నాయుడు అన్నారు. సోమవారం జొన్నగిరి, ఆర్ఎస్ పెండేకల్ సొసైటీల్లో వారోత్సవాల్లో అందించే రుణాలు, వ్యవసాయ పనులపై అవగాహన కల్పించారు. సొసైటీలు అభివృద్ధి చెందాలంటే రైతులు తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించాలన్నారు. ప్రభుత్వం సొసైటీలను కంప్యూటరీకరణ చేస్తుందని రైతులు తమ వివరాలను ఆన్‌లైన్లో చూసుకోవచ్చన్నారు. త్వరలో సొసైటీలోనే బ్యాంకులను ఏర్పాటు చేస్తామన్నారు. సిబ్బంది మధు, నాగరాజు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు స్థల పరిశీలన

క్రిష్ణగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కంభాలాపాడు గ్రామంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు సోమవారం డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భారతి, వైస్ ప్రిన్సిపాల్ వీరాచారి సబ్ స్టేషన్ వెనుక ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. పూర్తి వివరాలను ఉన్నతాదికారులకు నివేదిస్తానని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూలు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి ఆలంకొండ నబిసాహెబ్, మండల పార్టీ అధ్యక్షుడు కటారుకొండ మర్రి శ్రీరాములు, మండల ప్రదాన కార్యదర్శి మాదాపురం గురుస్వామి ఉన్నారు.

సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని గ్రంథాలయ అధికారి సుజాత సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు వ్యాసరచన చిత్రలేఖనం, పోటీలను నిర్వహించారు. సెల్‌ఫోన్‌కు అలవాటు పడితే, జ్ఞాపకశక్తి తగ్గి చదువుపై ఏకాగ్రత పెట్టలేర న్నారు. పుస్తకాలను చదవాలని సూచించారు. తెలుగు అధ్యాపకుడు నల్లారెడ్డి, దేవేంద్రప్ప పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

ఆలూరు రూరల్: పాఠకులు గ్రంథాలయలను వినియోగించుకోవాలని గ్రంథాలయ అధికారి విజయ భాస్కర్, జడ్పీహెచ్ పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఆసీయా బేగం పేర్కొన్నారు. సోమవారం మొలగవల్లిలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వ్యాసరచన, క్రీడా పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఇష్టపడి చదివితే భవిషత్ ఉంటుందన్నారు. క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. ఉపాధ్యాయులు పవన్, విజయకుమార్, రామంజనేయులు పాల్గొన్నారు.

భక్త కనకదాసు జయంతి

- మండల కేంద్రాల్లో, గ్రామాల్లో ర్యాలీలు


పత్తికొండ టీడీపీ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న నాయకులు

పత్తికొండ,నవంబరు18(ఆంధ్రజ్యోతి): భక్త కనకదాసు జయంతి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. కురవ కార్పొరేషన్ సభ్యుడు హోటల్ శ్రీనివాసులు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిన లోక్‌నాథ్, కురువ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమలింగడు చిత్రపటానికి నివాళి అర్పించారు. బడుగు బలహీన వర్గాలకు రాజకీయంగా పెద్దపీట వేసింది టీడీపీ అన్నారు. కనకదాసు జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు సీఎం చంద్ర బాబు ఆదేశాలు జారీచేయడం హర్షణీయమన్నారు. దీన్ని ప్రభుత్వసెలవుగా ప్రకటించాలని కోరారు. కేపీ బ్రహ్మయ్య, ఎరుకలచెరువు సురేంద్ర, కొత్తపల్లి అల్లెప్ప, అగ్రహారం హనుమంతు, క్రాంతిలింగన్న, తిక్కరమేష్, బురుజుల పక్కీరప్ప, చిన్నహుల్తిరంగన్న, ముత్తుకూరు చంద్రన్న ఉన్నారు.

ఆదోని టౌన్: జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించడం అభినందనీయమని మాదాసి కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు గౌడ్ అన్నారు. సోమవారం విక్టోరియా పేటలో భక్త కనకదాస్ జయంతిని జరుపుకొన్నారు. ఎస్సీ రిజర్వేషన్ హామీని అమలు చేయాలని కోరారు. గొర్రెల కాపరులుగా దుర్భర జీవితాలను గడుపుతు న్నారన్నారు. భాస్కర్, ఈరన్న, చౌడప్ప, కుబేర, రాజశేఖర్, ఉమామహేష్ పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: మొలగవల్లి, పెద్దహోతూరు అరికేర, కమ్మరచేడు, మనేకుర్తి తదితర గ్రామాల్లో నివాళి అర్పించారు. మాదాసి మాదారి కురువ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ మోహన్, టీడీపీ నాయకుడు కురవ దేవేంద్రప్ప, బెలగంటి హనుమప్ప, కురవ లక్ష్మి నారాయణ, సర్పంచులు వీరేశ్, కొల్లమ్మ, నాగరాజు లక్ష్మన్న, రామంజి నేయులు, గంజి మంగన్న, ఉరుకుంద, లక్ష్మిరెడ్డి, ఈరన్న, హరే రామ్, చంద్ర, ఉల్లెప్ప, సురేష్ లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

హాలహర్వి: హాలహర్వి, నిట్రవట్టి, విరుపాపురం, గూళ్యం గ్రామాల్లో కనకదాస్ విగ్రహాలకు పూల మాలలు వేసి ఊరేగింపు నిర్వహించారు.

ఆస్పరి: అలిగేర, ముత్తుకూరు గ్రామాల్లో నివాళులర్పించారు. ఎంపీటీసీ రహింతుల్లా, లక్ష్మణ్ణ, గంగాధర్ పాల్గొన్నారు.

హొళగుంద: పెద్దహ్యాట్ట మల్లయ్య, ఎస్ కేగిరి, వందవాగాలి శేషప్ప, ఎండీ హల్లి వీరనగప్ప, సర్పంచ్ సుధాకర్ పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు తీర్చాలి

● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి
● ఎమ్మిగనూరు ప్రజల కష్టాలపై అసెంబ్లీలో గళం



ఎమ్మిగనూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణ ప్రజల తాగునీటి కష్టాలు తీర్చాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం అసెంబ్లీలో గళం విప్పారు. ఆయన మాట్లాడుతూ అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన ఏఐఐబీ తాగునీటి ప్రాజెక్టును గత వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో ఆపేసిందననారు. పనులు నత్తనడకన సాగాయని దీంతో పట్టణ ప్రజలు తాగునీటి కష్టాలను ఎదుర్కోంటున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి, పట్టణ ప్రజల తాగునీటి కష్టాలను తీర్చేలా చూడాలని మున్సిపల్ మంత్రి నారాయణను కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి నారాయణ ప్రస్తుతం ఎమ్మిగనూరు మున్సిపాలిటీకి టీబీడ్యాం ఎల్లెల్సీ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. అయితే పట్టణానికి 14.07 ఎంఎల్‌డీ నీటి అవసరం ఉండగా ప్రస్తుతం 10.45 ఎంఎల్‌డీల నీరు మాత్రమే సరఫరా అవుతోందన్నారు. 2019 ఫిబ్రవరిలో ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బ్యాంకు, రాష్ట్ర ప్రభుత్వం 70:30 శాతం నిధులతో మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు విడుదల చేసినా, గత ప్రభుత్వం రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయకపోవటంతో ప్రాజెక్టు పనులు పూర్తి కాలేదన్నారు. వైసీపీ హయాంలో కేవలం 8.3శాతం పనులు మాత్రమే చేశారని తెలిపారు. ప్రాజెక్టు గడువు ఈ ఏడాది జూలై నాటికి ముగియటంతో సీఎం చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి గడువు పొడిగించేలా చర్యలు తీసుకున్నారన్నారు. తాగునీటి సమస్యను సమూలంగా పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు చంద్రబాబు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 2039వరకు పట్టణ జనాభాను దృష్టిలో పెట్టుకొని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

మఠానికి రూ.2.75 లక్షల విరాళం

మంత్రాలయం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మఠానికి మైసూరు భక్తుడు శ్రీవాత్స రూ.2.75 లక్షలు విరాళమిచ్చినట్లు ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ వెంకటేష్ జోషీ తెలిపారు. సోమవారం భక్తుడు కుటుంబ సమేతంగా వచ్చి చెక్కు ఇచ్చారు.పీఠాధిపతి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, ప్రసాదం ఇచ్చారు.

మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సతీమణి మృతి

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి సతీమణి సుభాషిణమ్మ ఆదివారం సాయంత్రం మృతి చెందారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి నివాళి అర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే స్థానిక నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

సూర్యఘర్ యోజనను వినియోగించుకోండి: డీఈఈ



డీఈఈ నరేంద్ర ప్రసాద్

ఎమ్మిగనూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు సూర్యఘర్ యోజన పథకాన్ని వినియోగించుకోవాలని ఏపీ ఎస్పీడీసీఎల్ డీఈఈ నరేంద్ర ప్రసాద్ కోరారు. సోమవారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ గృహ వినియోగదారులు ప్రభుత్వం ఇచ్చే రాయతీతో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఇటి పైకప్పు కనీసం 10 చదరపు మీటర్లు లేదా చదరపు అడుగులు స్థలంలో 1కిలో వాట్స్ సామర్థ్యం (120 యూనిట్లు)గల సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చే సుకోవచ్చన్నారు. ప్రభుత్వం నుంచి రూ.30వేల రాయితీ లభిస్తుం దన్నారు. అలాగే 2కిలో వాట్లకు 240యునిట్ల ఉత్పత్తి అయ్యో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం నుంచి రూ. 60వేలు వస్తుందని, 3 కిలో వాట్లకు 360యూనిట్లుకు రూ.78వేలు రాయితీ లభిస్తుం దన్నారు. తక్కువ వడ్డీకి బ్యాంకు రుణాలు లభిస్తాయన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

పెద్దకడబూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పేదలు ఇళ్ల నిర్మించుకోడానికిరూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ కార్యదర్శి వీరేష్, బీకేయంయూ కార్యదర్శి కుమ్మరి చంద్ర డిమాండ్ చేశారు. సోమవారం పెద్దకడబూరులో డిజిటల్ అసిస్టెంట్ వినోద్‌కు వినతి పత్రం అందజేశారు. గత వైసీపి ప్రభుత్వం సెంటున్నర స్థలాలిచ్చి, పునాది వరకే ఇంటిని నిర్మించిందన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యాక్షులు ఆంజినేయ, రెక్కల గిడ్డయ్య, నాగిరెడ్డి, శ్రీరాములు, అర్జున్,రంగస్వామి సుభాన్, నాగరాజు పాల్గొన్నారు.

సంప్రదాయాలను మరువకూడదు



వన భోజనం చేస్తున్న విద్యార్థినులు

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయాలను మరువకూడదని బనవాసి గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసగుప్త సూచించారు. సోమవారం కళాశాలలో వనభోజనం నిర్వహించారు.

మహాసభలను జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో ఈ నెల 27నుంచి నిర్వహించనున్న ఏఐఎస్ఎఫ్ 49వ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి షాబిర్ బాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజేంద్ర పిలుపునిచ్చారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ సమస్యల పరిష్కారానికి పోరాడాలన్నారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. రంగస్వామి, అబ్దుల్, శంకర్, మోహన్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ళను నిర్మించి ఇవ్వాలి



ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కౌతాళం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వం ఇళ్ళను నిర్మించి ఇవ్వాలని సీపీఐ కార్యదర్శి భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ఆదేశాల మేరకు సచివాలయం వద్ద ధర్నా చేశారు. గత ప్రభుత్వం మోసం చేసిందని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. అనంతరం ఎంపీడీవో సుబ్బరాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యదర్శి ఈరన్న కార్యకర్తలు సరేష్, హనుమేష్, నరసింహులు, జిలాని ఉన్నారు.

వెండి గజ వాహనంపై ప్రహ్లాదరాయలు



గజవాహనం పై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి గజవాహనం పై భక్తులకు దర్శనం ఇచ్చారు. సోమవారం తదియను పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచే మూల బృందావనానికి మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య వెండి గజవాహనంపై స్వర్ణ అంబారిలో వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్టించి పీఠాధిపతి మహా మంగళహారతితో ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. విద్యుత్ కాంతుల మధ్య గజవాహనం ఊరేగింది.

అసభ్యకర పోస్టులపై చర్యలు తీసుకోండి



ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కౌతాళం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయాలని ఐటీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మంజునాథ, మైనార్టీ సెల్ కార్యదర్శి రహిమాన్ డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌పై ఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ తోపాటు మహిళా నాయకులపై అసభ్యకర పోస్టులు పెడుతున్నారన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన వైసీపీ కార్యకర్త బగ్గు జయరాంపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాని కౌతాళం సీఐ అశోక్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు.

పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ నిత్యానంద రాజు

కోసిగి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ నిత్యనందరాజు హెచ్చరించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. కోసిగి మండలం జిల్లాలో చివరి స్థానంలో ఉందని, జిల్లాలోనే ముందుండేలా కృషి చేయాలన్నారు. డీటీ రుద్రగౌడ్, ఆర్ఐ శ్రీరాములు, రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు ఉన్నారు.

ఏఐఎస్ఎఫ్ సభలను జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న సంఘం నాయకులు

మంత్రాలయం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27 నుంచి 30 వరకు విజయనగంలో నిర్వహించే 49వ ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి షాబిర్ బాషా పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోస్టర్లను విడుదల చేశారు. విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. థామస్, మండల కోశాధికారి వీరేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు



నందవరంలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

నందవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం జడ్పీహెచ్ పాఠశాలలో క్రీడా పోటీలు నిర్వహించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా లైబ్రేరియన్ శివరామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో కబడ్డీ, పరుగు పందెం, ఖోఖో, మ్యూజికల్ చైర్స్ క్రీడలతో పాటు, వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

స్థలాలు ఇచ్చి, ఇల్లు నిర్మించాలి



వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

నందవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిరుపేదలకు స్థలాలిచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ కార్యవర్గ సభ్యుడు పంపన్న గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం నందవరం సచివాలయం వద్ద ధర్నా చేశారు. మూడు సెంట్ల స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించాలని, ఇసుక, సిమెంట్ ఇనుము, కూలీలు పెరగినందున రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మికి వినతిప్రతం అంజేశారు. సోమేశ్వరరెడ్డి, గిడ్డయ్య, ముని, నాగరాజు, పుల్లన్న, తిమ్మప్ప, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వేదవతి కోసం ఉద్యమిస్తాం

ఆలూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాయలసీమకు జరుగుతున్న అన్యాయాన్ని నివారించేందుకు వేదవతి రిజర్వాయర్ సాధన కోసం ఉద్యమాలను ఉధృతం చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జ్యోతిబసు భవన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో మండల కార్యదర్శి షాకీర్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో కాంగ్రెస్, సీపీఐ, బీఎస్పీ తదితర రాజకీయ పక్షాల నాయకులు పాల్గొన్నారు. 8 టీఎంసీల సామర్థ్యంతో వేదవతి రిజర్వాయర్ నిర్మాణానికి 2024-25 బడ్జెట్‌లో 500 కోట్లు కేటాయించాలని, లేనిపక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు హనుమంతు, కేపీ నారాయణ స్వామి, వెంకటేశులు, కాంగ్రెస్ నాయకులు లక్ష్మన్న, రామాంజనేయులు, గోవిందు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలను అవమానిస్తే కఠిన శిక్షలు

● డీఎస్పీ మహేంద్రబాబు
● చట్టాలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న డీఎస్పీ మహేంద్రబాబు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అంటరానితనం, అస్పృశ్యతలు చట్టరీత్యా నేరమని, ఈ కేసుల్లో నేరుగా డీఎస్పీ స్థాయి అధికారి విచారణ చేస్తారని డీఎస్పీ మహేంద్రబాబు అన్నారు. సోమవారం పట్టణంలోని వైష్ణవి జూనియర్ కళాశాలలో సీఐడీ సీఐ దస్తగిరి ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం 1989పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఈ విధమైన నేరాలకు పాల్పడే ఆరు నెలల నుంచి ఐదు సంవత్సరాల జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు. మనుషులంతా ఒక్కటేనని, అందరూ కలిసికట్టుగా జీవించాలని, కుటుంబ విలవలు కాపాడాలన్నారు.

విద్యార్థులు మంచి నడవడిక తోపాటు చురుకుదనం కలిగివుండాలని, విద్య సమాజానికి ఉపయోగపడేలా చూసుకోవాలని సూచించారు. నిరక్షరాసులకు విద్య, ప్రభుత్వ పథకాలను తెలియచేయాలన్నారు. వైష్ణవి కాలేజీ చైర్మన్ గడిగె లింగప్ప, డైరెక్టర్ విష్ణు, సీఐలు శివప్రసాద్, రంగయ్య, శ్రీనివాసులు, విక్రమ్‌సింహ, గంగాధర్, ఎస్ఐ నాయక్, అడ్వకేట్ విమలాదేవి, నర్సారెడ్డి, ఆదెన్న, దేవసహాయం పాల్గొన్నారు.

'బెల్టు' వ్యాపారుల దందా

● చోద్యం చూస్తున్న అధికారులు
● ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు



మద్యాన్ని తరలిస్తున్న నిర్వాహకులు

నందవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఓ వైపు ప్రభుత్వం, అధికారుల హెచ్చస్తుంటే నిర్వాహకులు మాత్రం యథేచ్ఛగా వ్యవహరిస్తున్నారు. సోమవారం కొందరు వ్యాపారులు మద్యం బాక్సులను నందవరానికి తరలిస్తున్న దృశ్యం విలేఖర్ల కంటపడింది. మండలంలో మాత్రం వ్యాపారులు ఇష్టారాజ్యంగా మద్యాన్ని తరలి స్తున్నారు. వారం క్రితం నందవరం టీడీపీ నాయకుడు గురురాజారావు నేరుగా బెల్టు షాపుకు వెళ్లి అక్రమ మద్యాన్ని అమ్ముతున్న వారిని పట్టుకుని నిలదీసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తూతూ మం త్రంగా విచారించి బెల్టు షాపు నిర్వాహకులను వదిలేసి, పనివారిపై కేసు నమోదు చేశారనే విమర్శ ఉంది. నిర్వాహకులు పెరిగిపోయినా, అధికారులు మాత్రం నామమాత్రంగానే తనిఖీలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. బెల్టు షాపులతో తమ సంసారాలు గుల్ల అవుతున్నాయని మహిళలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసు, ఎక్సైజ్ అధికారులు ఇప్పటికైనా స్పందించి బెల్టు షాపులను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భక్త కనకదాసు జయంతి



ఎమ్మిగనూరులో నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం కనకదాసు జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళి అర్పించారు. నాయకులు మాట్లాడుతూ కర్ణాటకలో జన్మించిన కనకదాసు సమాజంలో మార్పు తెచ్చేందుకు కృషి చేశారన్నారు. కేటీ వెంకటేశ్వర్లు, మద్దిలేటి, బజారి, హనుమంతు, రాముడు, నరసింహులు, కొండన్న గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా కనకదాసు జయంతి

ఎమ్మిగనూరు రూరల్/పెద్దకడబూరు: కనకదాసు జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పెద్దకడుబూరులో టీడీపీ యువ నాయకుడు మాధవరం రామకృష్ణారెడ్డి, టీడీపీ రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంతరెడ్డి పోటీళ్ల పోటీలను ప్రారంభించారు. విజేతలకు బహుమతులు ఇచ్చారు. కురువ సంఘం నాయకులు మల్లికార్జున, దేవేంద్ర, సిద్దప్ప, టీడీపీ నాయకులు మీసేవ ఆంజనేయులు, వీరేష్ గౌడ్, రామాంజనేయులు, వెంకటేష్, తలారి అంజి, మాలపల్లి లక్ష్మన్న పాల్గొన్నారు.



పెద్దకడబూరులో నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

వైభవంగా భక్త కనకదాసు రథోత్సవం

మంత్రాలయం: మండలంలోని సుంకేశ్వరి, మాధవరం, మంత్రాలయం, చెట్నహళ్లి, సూగూరు, వగరూరు, కల్లుదేవకుంట గ్రామాల్లో కనకదాసు రథోత్సవం నిర్వహించారు. సోమవారం కనకదాసు విగ్రహానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకంచేసి హారతులిచ్చారు. అనంతరం భక్త కనకదాసు విగ్రహన్ని ఎద్దులబండిపై ఊరేగించారు. బీరప్పడోలు, మంగళవాయిద్యాలు, టపాకాయల శబ్దాలు, గురవయ్యలు నృత్య ప్రదర్శనతో మారుమోగింది. టీడీపీ నాయకులు రామకృష్ణరెడ్డి, చలపతి, బీరప్ప, నరసింహులు, లక్ష్మీరెడ్డి, ఈరన్న, మల్లేష్, కురువ మల్లికార్జున, మాలపల్లి లక్ష్మన్న, నాగిరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను వేగంగా పరిష్కరించండి : సబ్ కలెక్టర్

ఆదోని, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్‌లో మండలాల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మండలంలోని అధికారులు సమస్యలను గడువులోపు పరిష్కరించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు.

మండలాల నుంచి వచ్చిన సమస్యలు కొన్ని

1. గ్రామంలో తాగునీటి పైపు మరమ్మతులకు గురికావడంతో నీరు రావడం లేదని మరమ్మతులు చేసి తాగునీరు అందించాలని 104 బసాపురం గ్రామ ప్రజలు అర్జీ సమర్పించుకున్నారు.

2.ఆదోని మండలం నెట్టేకల్ గ్రామానికి చెందిన రామాంజినేయులు తనకు సర్వే నెంబర్ 113లో 1.57ఎకరాల భూమి పెద్దల నుంచి వచ్చిందని, ఆన్‌లైన్‌లో వేరే వారి పేరుందని, విచారణ చేసి తనపేరు ఎక్కించి, పట్టాదారు పుస్తకం మంజూరు చేయవలసినదిగా అర్జీ సమర్పించుకున్నారు.

3. ఆదోని మండలం గణేకల్లు గ్రామంలో రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభం ఉందని తొలగించాలని గ్రామానికి చెందిన పెద్ద విరుపాక్షి అర్జీ సమర్పించుకున్నారు.

4. ఆదోని మండలం కుప్పగల్ గ్రామానికి ఆంజనేయులు తనకు సర్వే నెంబర్ 178/1లో ఎకరా భూమి కొనుగోలు చేశానని, అయితే ఆన్‌లైన్‌లో వేరే వారి పేరుందని, విచారణ చేసి ఆన్‌లైన్‌లో తన పేరు ఎక్కించాలని అర్జీ సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏవో వసుంధర, సర్వేయర్స్ శ్రీనివాసరాజు, వేణు సూర్య, డీఎల్‌డీపీవో, నూర్జహాన్, డీఎల్‌డీవో ప్రభాకర్ రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, హౌసింగ్ డీఈ రవికుమార్, ఆర్అండ్‌బీ డీఇ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సార్లూ.. ఎక్కడ?

● పన్నెండు గంటలైనా తెరుచుకోని సచివాలయం

కోసిగి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-5 మధ్యాహ్నం 12 గంటలైనా తెరచుకోలేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చినవారు వేచి చూచారు. తహసీల్దార్, ఎంపీడీవో, ఎక్సైజ్ కార్యాలయాలకు కూత వేటు దూరంలోనే ఈ సచివాలయం ఉంది. నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మధ్యాహ్నం 12 గంటలైనా తాళం వేసి ఉన్న కోసిగి సచివాలయం 5